Follow: @ANNTELUGU
07-08-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 215  పేజీలు-08  వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM

జగన్ అండ్ కోను కంట్రోల్ చేయడానికి
## రెండు నిమిషాలు చాలు

- స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి.
- మంత్రులకు కేబినెట్ సమావేశంలో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం.

02



## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

భూ బదిలీలు, ట్విన్ టవర్స్, పీపీపీ పాలసీకి ఆమోదం.

02







# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- **భూ బదిలీలు, ట్విన్ టవర్స్, పీపీపీ పాలసీకి ఆమోదం.**

**అమరావతి, మహా :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు.ఏదుల ముస్తూరులో 19.55 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కు బదిలీ చేసేందుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. అలాగే తిమ్మసముద్రంలో 13.45 ఎకరాల భూమిని రాజధాని పట్టణాభివృద్ధి సంస్థ కు బదిలీ చేయడానికి కూడా ఆమోదం తెలిపిందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా పట్టణాభివృద్ధి సంస్థల పునర్వ్యవస్థీకరణ చేపడుతూ యూడీఏల సంఖ్యను 21 నుంచి 23కు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు. పరిశ్రమల అభివృద్ధికి ఊతమిచ్చేలా కండలేరు నుంచి ఇండస్ట్రియల్ క్లస్టర్‌కు నీటి సరఫరా ప్రతిపాదనకూ ఆమోదం లభించిందని చెప్పారు. విజయవాడ ఆటోనగర్ కాలనీవాసుల యూడీఎస్ హక్కులను క్రమబద్ధీకరించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని, 400 హౌసింగ్ యూనిట్లకు సంబంధించిన భూ సమస్యకు కూడా పరిష్కారం చూపినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా ప్రతిష్ఠాత్మక 'అమరావతి ఐ' ప్రాజెక్టుకు సవరించిన టెండర్లను మంత్రివర్గం ఆమోదించిందని, ఎత్తైన నిర్మాణంగా దీనిని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అమరావతిలో 47 అంతస్తులతో ట్విన్ టవర్స్ నిర్మాణానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ టవర్స్‌లో కార్పొరేట్ సంస్థలు, క్వాంటమ్ టెక్నాలజీ సంస్థలకు కార్యాలయాలు ఏర్పాటు చేసుకునే అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. హైకోర్టు భవన రీడిజైన్ ప్రతిపాదనకూ గ్రీన్‌సిగ్నల్ లభించిందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం లక్ష్యంగా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా ఆమ్నిబస్ చట్టం2026ను తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నిబంధనలను తొలగించి పారిశ్రామిక వృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అలాగే ఏపీ పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పాలసీ2026కు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, పీపీపీ ప్రాజెక్టులకు రూ.1,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. భారీ పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించడమే కొత్త పాలసీ లక్ష్యమని స్పష్టం చేశారు. కుప్పం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం భూసేకరణలో డిఫామ్ లేని సాగుదారులకు ఎకరాకు రూ.12.44 లక్షల ప్రత్యేక పరిహారం చెల్లించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అలాగే మోతడక ప్రాంతంలో 2,344 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టేందుకు ఆమోదం లభించిందని తెలిపారు. హైస్పీడ్ రైలు ప్రాజెక్టు, ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూముల సమీకరణకు కూడా మంత్రివర్గం అంగీకారం తెలిపిందని మంత్రి పార్థసారథి వెల్లడించారు.

# జొన్న రైతుల ఖాతాల్లోకి రూ.994 కోట్లు.

- **వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు.**
- **దేశానికే తెలంగాణ ఆదర్శం.**
- **వెల్లడించిన మంత్రి తుమ్మల!**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రైతాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీపికబురు అందించారు. రాష్ట్రంలో జొన్న పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ.994 కోట్ల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం, ఇతర పంటల కొనుగోలు విధానం ఎంతో పారదర్శకంగా, వేగవంతంగా సాగుతోందని.. ఈ పనితీరు మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.అలాగే రాష్ట్రంలో ఎరువుల పంపిణీ వ్యవస్థను డిజిటలైజ్ చేస్తూ తీర్చిదిద్దిన 'తెలంగాణ ఎరువుల యాప్' సాధించిన విజయంపై మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఈ యాప్ ప్రమాణాలు, పనితీరును ప్రామాణికంగా తీసుకునే కేంద్ర ప్రభుత్వం కూడా స్ఫూర్తి పొందిందని, అందుకనుగుణంగానే 'ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్' (ఎఫ్ఎఫ్ఎస్) వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందేలా రూపొందించిన ఈ నూతన పంపిణీ విధానాన్ని నేటి నుంచి రాష్ట్రంలోని మరొక 10 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వ్యవసాయ రంగంలో కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, అధిక లాభాలనిచ్చే వాణిజ్య పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అత్యవసరత ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, సాంకేతిక పరిజ్ఞానం, అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించాలని సూచించారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రాన్ని ఆయిల్ పామ్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఇదే సమావేశంలో చేనేత రంగానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించేలా నిర్వహించిన 'హ్యాండ్లూమ్ హ్యాకథాన్' విజేతలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల సాంప్రదాయ నైపుణ్యాలకు ఆధునిక డిజిటల్ సాంకేతికత తోడైతే అంతర్జాతీయ మార్కెటింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతల పరుగు.

- **అధిష్ఠానం అత్యవసర పిలుపు వెనుక వ్యూహమేంటి?**
- **మారుతున్న రాజకీయ సమీకరణాలు.**
- **హస్తినలో కమలనాథుల కీలక మథనం.**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకత్వానికి కేంద్ర అధిష్ఠానం నుంచి అత్యవసర పిలుపు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు, అంతర్గత పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ పెద్దలు ఏకంగా రాష్ట్ర ముఖ్య నేతలందరినీ హుటాహుటిన హస్తినకు రావాలని ఆదేశించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా అందిన ఈ పిలుపుతో కమలనాథులు తమ తదుపరి రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.అధిష్ఠానం నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక ప్రజా ప్రతినిధులు తెల్లవారుజామునే ప్రత్యేకంగా ఢిల్లీకి పయనం కానున్నారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిమిత్తం రాష్ట్రానికి చెందిన బీజేపీ పార్లమెంటు సభ్యులు ఢిల్లీలోనే మకాం వేసిన విషయం తెలిసిందే. వీరంతా కలిసి రేపు మధ్యాహ్నం సరిగ్గా 3 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో జరగనున్న అత్యంత కీలకమైన ఉన్నతస్థాయి భేటీలో పాల్గొననున్నారు. రాష్ట్ర పార్టీ భవిష్యత్తు కార్యచరణను, దూకుడును ఈ సమావేశమే నిర్దేశించబోతోందని తెలుస్తుంది.ఈ అత్యున్నతస్థాయి సమావేశానికి ముందే ఢిల్లీ వేదికగా పక్కాగా గ్రౌండ్ వర్క్ పూర్తయినట్లు తెలుస్తోంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ ఇవాళ ఇప్పటికే నితిన్ నబీన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీ తాజా పరిస్థితి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు, ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలపై ఆయన అధిష్ఠానానికి ఒక సమగ్రమైన, వాస్తవిక నివేదికను సమర్పించినట్లు సమాచారం. ఈ సుదీర్ఘ నివేదికలో పొందుపరిచిన అంశాల ఆధారంగానే రేపటి భేటీలో రాష్ట్ర నేతలకు జాతీయ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నట్లు స్పష్టమవుతోంది.
ఈ ఆకస్మిక సమావేశం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ప్రధానంగా తెలంగాణలో ఇటీవల చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిణామాలు, అధికార పార్టీకి ధీటుగా ప్రజా సమస్యలపై పోరాడటంలో అనుసరించాల్సిన సరికొత్త వ్యూహాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. దీనికి తోడు, రాష్ట్ర నాయకుల మధ్య ఎంతో కొంత సమన్వయ లోపం ఉందన్న వార్తలు అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నాయకుల మధ్య ఉన్న చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి, సమష్టిగా ఎలా ముందుకు సాగాలి, క్యాడర్‌లో ఎలా ఉత్సాహం నింపాలి అనే దానిపై కేంద్ర పెద్దలు కీలక సూచనలు చేయనున్నారు. అలాగే, ఇటీవల హైకమాండ్ జారీ చేసిన కీలక ఆదేశాల అమలు తీరుపై కూడా రేపటి సమావేశంలో ఆసాంతం సమీక్షించనున్నారు.మొత్తానికి, భవిష్యత్ రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడానికి, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా మరింత బలోపేతం కావడానికి తెలంగాణ బీజేపీని సమాయత్తం చేసే దిశగానే ఢిల్లీ పెద్దలు ఈ వ్యూహాత్మక భేటీకి రూపకల్పన చేసినట్లు అర్థమవుతోంది.

## జగన్ అండ్ కోను కంట్రోల్ చేయడానికి
# రెండు నిమిషాలు చాలు

- **స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి.**
- **మంత్రులకు కేబినెట్ సమావేశంలో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం.**



**అమరావతి, మహా** :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. మూడున్నర గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, అభివృద్ధి కార్యక్రమాలు, చట్టవ్యవస్థ, సంక్షేమ పథకాలు, ప్రాజెక్టుల పురోగతిపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు.
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు, "జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి నాకు రెండు నిమిషాలు చాలు. కానీ రాజకీయాల ముసుగులో నేరాలకు పాల్పడుతున్నందున చట్టబద్ధంగానే వ్యవహరిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదని, ప్రభుత్వం ఇప్పటికే అన్ని అంశాలను ప్రజలకు వివరించిందని చెప్పారు. రిజర్వేషన్లపై కూడా ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత మంత్రులదేనని సూచించారు.
ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం జిల్లా ప్రజలకు తాగునీరు అందిస్తామని సీఎం ప్రకటించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటి సరఫరా కొనసాగిస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు సూచించారు. ఇటీవల ప్రారంభమైన భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలికిందని, ఆ ప్రారంభోత్సవంలో గిరిజన థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు దక్కడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. స్వర్ణాంధ్ర-వికసిత్ భారత్ లక్ష్యాలను స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో విస్తృతంగా ప్రస్తావించాలని సూచించారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టును వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభిస్తామని వెల్లడించారు.'దిశా' చట్టం అసలు అమల్లోకి రాలేదని, కేంద్ర ప్రభుత్వం తిరస్కరించినప్పటికీ గత ప్రభుత్వం దానిపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. దిశా పోలీస్ స్టేషన్లు, వాహనాల పేరుతో హడావుడి చేశారని విమర్శించారు.
దేవరపల్లి పర్యటన సందర్భంగా వైసీపీ శ్రేణులు రైతుల పొలాలను ధ్వంసం చేశారని, చిరు వ్యాపారుల జీవనోపాధికి నష్టం కలిగించారని, దేవతల చిత్రాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. రైతులు తమ పంటలు నాశనమయ్యాయని తనకు సందేశాలు పంపారని పేర్కొన్నారు. జగన్ పర్యటనలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.
రాజకీయ పార్టీల ముసుగులో నేరగాళ్లు తయారవుతున్నారని, ప్రశాంత జిల్లాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు రైతులు, ఆక్వా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు సూచించారు. ఆక్వా రంగానికి రూ.1,100 కోట్ల విద్యుత్ రాయితీలు అందించామని, ఆక్వా ఫీడ్ ఎగుమతులపై సుంకాలను 50 శాతం తగ్గించేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు.
ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ఈ నెల 13న అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభిస్తామని తెలిపారు. అదే రోజు ఎమ్మెల్యే క్వార్టర్లను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, విజయదశమి నాటికి మంత్రుల నివాసాలను సిద్ధం చేస్తామని చెప్పారు.కేబినెట్ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపైనా విస్తృతంగా చర్చ జరిగింది. 11 రాష్ట్రాలకు చెందిన బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు కేబినెట్ ఉపసంఘాన్ని ఆదేశించారు. భూముల వేలంలో సరైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలించాలని సూచించారు. పదిహేనేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులందరికీ సముచిత పరిష్కారం లభించేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.

# ఒకే గొడుగు కిందికి రోడ్ల అభివృద్ధి

- **ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు.**



**హైదరాబాద్, మహా :** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించే దిశగా హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో రోడ్ల నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో ఆయన రోడ్ల విస్తరణ, పనుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రోడ్ల నిర్మాణంలో అత్యంత కీలకమైన భూసేకరణ, నిధుల సమీకరణ, నిర్వహణ వంటి అంశాలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను ఒకే గొడుగు కిందికి తేవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్వహణ సరిగా లేకపోవడం, ఇష్టానుసారంగా వాహనాలు నిలపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు ఓఆర్ఆర్ నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో రేడియల్ రోడ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు ప్రారంభించిన రేడియల్ రోడ్డు 1 పనులను డిసెంబర్ 9వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. రోడ్ల నిర్మాణంలో ఎదురయ్యే అడ్డంకులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. రోడ్లకు ఇరువైపులా విధిగా పచ్చదనం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణంతో పాటు బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.హైదరాబాద్ మహానగర భవిష్యత్తు పూర్తిగా రోడ్ల విస్తరణ, అభివృద్ధి పైనే ఆధారపడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఇందుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎటువంటి అలసత్వం లేకుండా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ కోసం జరిపే ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో దళారులు, మధ్యవర్తుల ప్రమేయం ఏమాత్రం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) జారీ చేసే ప్రక్రియను మరింత పారదర్శకంగా చేపట్టేందుకు వీలుగా ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# జెన్ జీని గుడ్డిగా నమ్ముతా

- **నిరసన వారి ప్రజాస్వామ్య హక్కు.**
- **విద్యకు జీడీపీలో 6 శాతం నిధుల కేటాయింపు త్వరలోనే సాధ్యం!**
- **ఐఐఎమ్‌యుఎన్ వార్షికోత్సవంలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఆసక్తికర వ్యాఖ్యలు.**




**ముంబయి, మహా :** విద్యా వ్యవస్థలో సంస్కరణలు, యువత ఆలోచనా ధోరణి, ప్రజాస్వామ్య హక్కులు సహా పలు అంతర్జాతీయ, సామాజిక అంశాలపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. ముంబయి వేదికగా నిర్వహించిన ఐఐఎమ్‌యుఎన్ 15వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యా రంగానికి జీడీపీలో 6 శాతం నిధుల కేటాయింపు అతిత్వరలోనే సాధ్యమవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసిన ఆయన.. నేటి 'జెన్ జీ' విద్యార్థులకు నిరసన తెలిపే పూర్తి ప్రజాస్వామ్య హక్కు ఉందని స్పష్టం చేశారు. సమస్యలను ప్రశ్నించడం, మార్పును ఆకాంక్షించడం నేటి తరం నైజమని, అంతమాత్రాన వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం ఎంతమాత్రం సరికాదని తేల్చిచెప్పారు.విద్యా రంగాన్ని ఒక ఖర్చులా కాకుండా, దేశ భవిష్యత్తు కోసం చేసే అత్యంత ప్రాధాన్యత కలిగిన పెట్టుబడిగా చూడాలని భాగవత్ పిలుపునిచ్చారు. చదువు వ్యాపారంగా మారకూడదని, సమాజంలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, మొత్తం సమాజం కూడా ఇందులో భాగస్వామ్యం వహించాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విద్య కోసం బడ్జెట్‌లో సుమారు రూ. 1.3 లక్షల కోట్లు (2.5 నుంచి 2.6 శాతం) వెచ్చిస్తోందని, కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి వ్యయం జీడీపీలో 4.1 శాతంగా ఉందన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ2020) నిర్దేశించిన 6 శాతం లక్ష్యం త్వరలోనే నెరవేరుతుందన్న నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణతో పాటు విద్యా వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
దేశంలో విద్యార్థుల ఆందోళనలు, నిరసనలపై స్పందిస్తూ.. తాను జెన్ జీ తరాన్ని గుడ్డిగా నమ్ముతానని భాగవత్ వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన కూడా చర్చలు, సంప్రదింపుల్లో ఒక ముఖ్యమైన భాగమేనని చెప్పారు. నిరసనలు వ్యవస్థను మెరుగుపరచడానికే తప్ప దేశానికి వ్యతిరేకంగా కాదని అందరూ గ్రహించాలన్నారు. గతంలో తమ తరం పెద్దలు చెప్పిన ప్రతి విషయాన్ని ప్రశ్నించకుండా అంగీకరించేదని, కానీ నేటి జెన్ జీ, జెన్ ఆల్ఫా తరాలు ప్రశ్నలు వేస్తూ తార్కికమైన సమాధానాలను ఆశిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. యువతలోని ఈ జిజ్ఞాసను ప్రేమతో, సహనంతో నివృత్తి చేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే సమస్య పరిష్కారాలకు మార్గం చూపుతోందని గుర్తుచేశారు. సోషల్ మీడియాను నిషేధించడం పరిష్కారం కాదని, దానిని బాధ్యతాయుతంగా ఉపయోగించడం నేర్చుకోవాలని సూచించారు.
దేశ భద్రత, విదేశాంగ విధానంపైన కూడా ఆర్ఎస్ఎస్ చీఫ్ తనదైన శైలిలో మాట్లాడారు. పాకిస్థాన్, చైనాలతో విభేదాలు ఉన్నప్పటికీ, శాశ్వత శత్రుత్వం దేనికీ పరిష్కారం కాదని స్పష్టం చేశారు. విభేదాలను పక్కనపెట్టి వ్యవహరించడమే భారత్ అనుసరించే సనాతన విధానమని, మానవత్వమే అత్యున్నతమైనదని అన్నారు. పాకిస్థానీలందరూ మనకు శత్రువులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. అలాగే ఎల్జీబీటీక్యూ వర్గం కూడా మన సమాజంలో భాగమేనని, అందరికీ స్థానం కల్పించే సుదీర్ఘ సంప్రదాయం భారతదేశానికి ఉందన్నారు. అయితే స్వలింగ వివాహాలకు మాత్రం తన మద్దతు ఉండదని స్పష్టం చేశారు. దేశంలో మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు గణనీయంగా పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పొగాకు వంటి క్యాన్సర్ కారకాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.



**చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి**

# నేతన్నలకు అండగా నిలవండి

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు**

**ఢిల్లీ, మహా:** 'జాతీయ చేనేత దినోత్సవం' సందర్భంగా దేశ ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 1905 ఆగస్టు 7వ తేదీన దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 'స్వదేశీ ఉద్యమం' ప్రారంభమైందని, ఈ చారిత్రక ఘట్టాన్ని మనం ఎప్పటికీ మరువకూడదని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో ప్రారంభమైన ఈ ఉద్యమమే నేటి 'ఆత్మనిర్భర్ భారత్' (స్వావలంబన భారత) దార్శనికతకు పునాది వేసిందని ఆయన స్పష్టం చేశారు. అప్పట్లో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా దేశవాసులంతా ఏకమై పెద్ద పోరాటమే చేశారని ప్రధాని పేర్కొన్నారు.
గత వారం దేశ ప్రజలందరూ 'ఫ్రెండ్‌షిప్ డే' (స్నేహితుల దినోత్సవం) ఎంత ఉత్సాహంగా జరుపుకున్నారో, అదే తరహా ఉత్సాహంతో ఆగస్టు 7న 'జాతీయ చేనేత దినోత్సవం' కూడా జరుపుకోవాలని ప్రధాని కోరారు. చేనేత దినోత్సవం జరుపుకోవడం అంటే ప్రతి పేద నేతన్న కుటుంబానికి అండగా నిలవడమేనని ఆయన వివరించారు. తమ ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి మగ్గాలపై నేత కార్మికులు ఎంతో శ్రమించి, తమ చేతులతో అద్భుతమైన వస్త్రాలను సృష్టిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. మార్కెట్లో విభిన్న రకాల చేనేత ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఆదరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు.
ఈ సందర్భంగా యువతకు , సోషల్ మీడియా వినియోగదారులకు ప్రధాని ఒక ప్రత్యేక సూచన చేశారు. ప్రజలు చేనేత వస్త్రాలను ధరించి 'గెట్ రెడీ విత్ మీ' వంటి వీడియోలు రూపొందించి, వాటిని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని సూచించారు. దేశంలోని పేద చేనేత కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వావలంబన భారత్‌ను నిర్మించడమే మన లక్ష్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక చేనేత ఉత్పత్తిని కొనుగోలు చేసి, దానికి సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం ద్వారా మన నేతన్నల నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్యవర్గాన్ని ప్రకటించిన
# కాక్రోచ్ జనతా పార్టీ

**ఢిల్లీ, మహా:** నిరుద్యోగుల గొంతుకగా తనను తాను అభివర్ణించుకుంటున్న కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) తమ సంస్థాగత నిర్మాణం మరియు జాతీయ విస్తరణ ప్రణాళికలో భాగంగా తొలి జాతీయ నాయకత్వ జాబితాను అధికారికంగా విడుదల చేసింది. ఛత్రపతి శంభాజీనగర్ వేదికగా నిర్వహించిన సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ కమిటీ ఈ నూతన నాయకత్వ రోస్టర్‌ను ఆమోదించింది. ఈ కొత్త నాయకత్వ నిర్మాణంలో యువతకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ కీలక రంగాలు , మండలాలకు నూతన బాధ్యులను ఖరారు చేశారు.
ఈ నూతన కార్యవర్గం ప్రకారం, కాక్రోచ్ జనతా పార్టీ స్థాపకుడు మరియు జాతీయ కన్వీనర్‌గా 30 ఏళ్ల అభిజీత్ దిప్కే బాధ్యతలు చేపట్టగా, సహ కన్వీనర్లుగా 30 ఏళ్ల అశుతోష్ రాంకా, 27 ఏళ్ల సౌరవ్ దాస్ నియమితులయ్యారు. జాతీయ సంస్థాగత ఇన్‌ఛార్జ్‌గా 35 ఏళ్ల అజింక్యా షిండేను, సంస్థాగత కోఇన్‌ఛార్జ్‌గా 26 ఏళ్ల దీపక్ బలియాన్‌ను ఎంపిక చేశారు. ఇక జాతీయ కార్యదర్శిగా 34 ఏళ్ల ఆఫ్రీన్ నవాజ్, మీడియా లీడ్‌గా 30 ఏళ్ల విజయ్ రెడ్డి మల్లాంగి, లీగల్ అఫైర్స్ లీడ్‌గా 31 ఏళ్ల రత్నా సింగ్, రీసెర్చ్ అండ్ పాలసీ లీడ్‌గా 29 ఏళ్ల వైష్ణవి గౌర్, టెక్నాలజీ లీడ్‌గా 31 ఏళ్ల రోహన్ దేశ్‌పాండే, ఫైనాన్స్ లీడ్‌గా 33 ఏళ్ల యోగేష్ ఇంగలే బాధ్యతలు స్వీకరించారు.జాతీయ విస్తరణ ప్రణాళికను వేగవంతం చేసే దిశగా నాలుగు ప్రధాన మండలాలకు (జోన్లకు) ప్రత్యేక నాయకత్వాన్ని సిజెపి ఖరారు చేసింది. ఉత్తర మండలానికి దీపక్ బలియాన్, దక్షిణ మండలానికి విజయ్ రెడ్డి మల్లాంగి, తూర్పు మరియు ఈశాన్య మండలాల సమన్వయానికి 35 ఏళ్ల అంకిత్ భరద్వాజ్, పశ్చిమ మండలానికి యోగేష్ ఇంగలే జోనల్ లీడర్లుగా వ్యవహరించనున్నారు.రాబోయే ఆరు నెలల కాలంలో దేశవ్యాప్తంగా రాష్ట్ర సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు లోక్‌సభ, నగర స్థాయిలలో ప్రత్యేక సమన్వయ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ ప్రతినిధులు వెల్లడించారు



# చెరువుల్లోకి శుద్ధి జలాలే లక్ష్యం

**తక్కువ ఖర్చుతో నీటి శుద్ధికి కొత్త సాంకేతికతపై హైడ్రా అధ్యయనం.**

**హైదరాబాద్, మహా.** నగరంలోని చెరువుల పునరుద్ధరణలో మరో ముందడుగు వేస్తూ, శుద్ధి చేసిన జలాలను చెరువుల్లోకి మళ్లించే విధానాలపై హైడ్రా దృష్టి సారించింది. చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా ఇప్పటికే ఇన్‌లెట్ల అభివృద్ధి చేపట్టిన హైడ్రా.. ఇప్పుడు తక్కువ వ్యయంతో నీటిని శుద్ధి చేసే ఆధునిక సాంకేతికతలను పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో బిట్స్ పిలానీ-కేకే బిర్లా గోవా క్యాంపస్ అభివృద్ధి చేసిన వర్టికల్ ఫ్లో కన్‌స్ట్రక్టెడ్ వెట్‌ల్యాండ్ టెక్నాలజీ' పై హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధ్యయనం చేశారు. బిట్స్ పిలానీ ఆహ్వానం మేరకు గురువారం గోవా వెళ్లిన ఆయన, స్థిరమైన మురుగునీటి నిర్వహణ, పట్టణ సరస్సుల పునరుద్ధరణకు సంబంధించిన పలు సాంకేతిక విధానాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా ఎస్‌బీఆర్, ఎంబీఆర్, వెట్‌ల్యాండ్ ట్రీట్‌మెంట్ సాంకేతికతలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను తిలకించారు. హైదరాబాద్‌లో చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాఫ్ట్స్ సంస్థ ప్రతినిధి యూనస్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. కేవలం సాంకేతిక ప్రదర్శనకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ఈ విధానాల ద్వారా మురుగునీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే అంశాన్ని హైడ్రా బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. తక్కువ విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం, దీర్ఘకాలిక సామర్థ్యం, ప్రకృతి ఆధారిత నీటి శుద్ధి విధానాలను అధ్యయనం చేసింది. ఈ సాంకేతికత ద్వారా నీటి నాణ్యత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పునరుద్ధరణ, జీవవైవిధ్య పరిరక్షణకు కూడా గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని బిట్స్ పిలానీ గోవా క్యాంపస్ ప్రొఫెసర్లు వివరించారు. హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా పాతబస్తీలోని బమ్రుకున్‌ఉద్‌దౌలా చెరువు వద్ద ఈ వ్యవస్థను ఏర్పాటు చేసి ఫలితాలను పరిశీలించాలని నిర్ణయించినట్లు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే నగరంలోని ఇతర చెరువుల పునరుద్ధరణలో కూడా ఇదే సాంకేతికతను అమలు చేసే అవకాశాలను పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

# ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వ విధానాలు

- **రూ.21.61 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.**
- **ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన.**

ఖమ్మం, మహా : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజలకు నిజమైన భరోసా కల్పిస్తున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లో గురువారం విస్తృతంగా పర్యటించిన మంత్రి.. ఉచిత సన్నబియ్యం పంపిణీ, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, రైతులతో మమేకం, ప్రజల సమస్యలపై ఆరా వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామంలోని చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి మూడు నెలలకు సంబంధించిన ఉచిత సన్నబియ్యాన్ని రేషన్ కార్డుదారులకు పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రతి రేషన్ కార్డుదారునికి నెలకు ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే రేషన్ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు.గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని చాలామంది వినియోగించకుండా విక్రయించేవారని, ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన సన్నబియ్యాన్ని కుటుంబ సభ్యులే వినియోగిస్తున్నారని తెలిపారు. ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తూ గతంతో పోలిస్తే ఎంతో మెరుగైన బియ్యం అందుతోందని తెలిపారు. అనంతరం కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈశ్వర మాదారం-భద్రు తండా మధ్య రూ.1.76 కోట్లతో చే



పట్టనున్న బీటీ రోడ్డు, తాళ్లగడ్డ తండా వరకు రూ.50 లక్షలతో నిర్మించనున్న మరో బీటీ రోడ్డు, చౌటుపల్లిలో రూ.3.20 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి, లింగారం తండాలో రూ.1.28 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. చౌటుపల్లి గ్రామాన్ని ఎంపీగా ఉన్న సమయంలో దత్తత తీసుకుని అభివృద్ధి చేశానని, ఇప్పుడు మంత్రిగా మిగిలిన పనులన్నీ పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. లింగారం తండాలో ఇప్పటికే రూ.5.45 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, వీధి దీపాల ఏర్పాటును వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపికను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ ఇటీవల రైతు భరోసా కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో నిధులు జమ చేశామని చెప్పారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్‌తో పాటు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని, పాలేరు ప్రాంతంలో రీసర్వే నిర్వహించి అర్హులైన ప్రతి రైతుకు పట్టాదారు పాస్‌బుక్లు అందిస్తామని స్పష్టం చేశారు. లింగారం తండాలో రైతులతో కలిసి పొలంలోకి దిగి స్వయంగా ఎద్దులతో దుక్కి దున్నిన మంత్రి వ్యవసాయ పనులపై రైతులతో చర్చించారు. రైతుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి పర్యటించిన మంత్రి.. గుదిమల్ల-ప్రకాశ్ నగర్ మధ్య రూ.5 కోట్ల రహదారి, కామంచికల్-కోయచిలక మధ్య రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గత 32 నెలల్లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని డివిజన్లలో రూ.21.61 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలు, కొత్త మున్సిపాలిటీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, రైతు భరోసా నిధులు జమ చేశామని మంత్రి పేర్కొన్నారు. సన్న వడ్లకు బోనస్, మద్దతు ధర అందిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి కొత్తగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లను కూడా మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. మరో రెండు రహదారులను మంజూరు చేయడంతో పాటు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సూచనల మేరకు అన్ని పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ గత 25 ఏళ్లలో జరగని స్థాయిలో అభివృద్ధి పనులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో జరుగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.75 కోట్లు మంజూరు కావడం వల్ల ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీశైలానికి ఉధృతంగా వరద.

- **2.16 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.**
- **జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.**

శ్రీశైలం,మహా : శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. గురువారం రాత్రి నాటికి జలాశయానికి 2,16,764 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రస్తుతం జలాశయం నుంచి ఎలాంటి నీటి విడుదల (ఔట్‌ఫ్లో) చేపట్టలేదు.శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 871.70 అడుగులుగా నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద ప్రవాహం పెరుగుతుండటంతో జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.వరద పరిస్థితిని సాగునీటి శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జలాశయ నీటి నిల్వలు, దిగువ ప్రాంతాల పరిస్థితులను సమీక్షిస్తూ అవసరాన్ని బట్టి గేట్లు ఎత్తి నీటి విడుదలపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- **సంగారెడ్డిలో సీఎం ప్రారంభం.**
- **119 నియోజకవర్గాల్లో ఒకేసారి పంపిణీ కార్యక్రమాలు.**
- **అధికారులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు.**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసి లామినేట్ చేసిన 1.05 కోట్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రేషన్ కార్డులను ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ భారీ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి రాష్ట్ర నీటిపారుదల, ఆహార & పౌర సరఫరాల శాఖ మంత్రి కార్యాలయం గురువారం అధికారిక మెమో జారీ చేసింది.కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఒకేసారి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక వేడుకలు ఉదయం నిర్వహించబడనున్నందున, అలాగే సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగే 'అట్ హోమ్' కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.




కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. లబ్ధిదారుల జాబితాలను తుది దశలో పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించింది. రేషన్ కార్డుల ముద్రణ, భద్రత, రవాణా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఆర్‌డీఓలు, పౌర సరఫరాల శాఖ అధికారుల మధ్య సమన్వయంతో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పంపిణీ కేంద్రాల్లో తాగునీరు, కూర్చునే సౌకర్యం, వేదికలు, నమోదుకు అవసరమైన ఏర్పాట్లు, ధ్రువీకరణ ప్రక్రియ, క్రమబద్ధమైన పంపిణీ కోసం తగిన సిబ్బందిని నియమించాలని సూచించింది. అలాగే కార్యక్రమానికి సంబంధించి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మీడియా సమన్వయం, విస్తృత ప్రచార చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమం ముగిసిన అనంతరం పంపిణీ చేసిన రేషన్ కార్డుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించింది. కొత్తగా అర్హత పొందిన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను విస్తరించే దిశగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం కీలక సంక్షేమ కార్యక్రమంగా పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెమోలో స్పష్టం చేసింది.

# రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు స్టే

- **డ్రోన్ సర్వేపై నిలుపుదల.. యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశం.**

**ఢిల్లీ, మహా :** రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై స్టే విధిస్తూ, తదుపరి విచారణ వరకు యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది. టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం వెల్లడించింది.హైకోర్టు తమ వాదనలు వినకుండానే డ్రోన్ సర్వేకు ఆదేశాలు ఇచ్చిందని టీజీఐఐసీ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు టీజీఐఐసీకి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఆగస్టు 14లోగా సవరణ పిటిషన్ దాఖలు చేయాలని సూచిస్తూ గడువు విధించింది. అలాగే రాయదుర్గం సర్వే నంబర్ 83/2లోని 46 ఎకరాల భూమిని వేలం వేసే ప్రతిపాదన ప్రస్తుతం లేదని టీజీఐఐసీ తరఫు సీనియర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణ వరకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం

# హరీశ్‌రావు క్షుద్రపూజలపై వివరణ ఇవ్వాలి

- **లీగల్ నోటీసులకు భయపడేది లేదు.**
- **సీఎం రేవంత్‌తో ఎలాంటి విభేదాలు లేవు**
- **మహేష్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు క్షుద్రపూజల అంశంపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మరోసారి డిమాండ్ చేశారు. హరీశ్‌రావును వ్యక్తిగతంగా కించపరచలేదని, ఆయనపై తప్పుడు ప్రచారం చేయడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. అయితే మార్చి 2న తిరుచ్చి, జూన్ 1న శివమొగ్గలోని క్షుద్రపూజలకు ప్రసిద్ధి చెందిన ఆలయాలకు ఆయన ఎందుకు వెళ్లారో ప్రజలకు చెప్పాలని కోరారు.గాంధీ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్.. తమకు మూఢ నమ్మకాలతో సంబంధం లేదని, కానీ హరీశ్‌రావు సందర్శించిన ఆలయాలు క్షుద్రపూజలకు ప్రసిద్ధి చెందినవని పేర్కొన్నారు. అందువల్ల ఆ ఆలయాలను ఏ ఉద్దేశంతో సందర్శించారో బహిరంగంగా వివరించాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రానికి ఎవరు శని, ఎవరు దరిద్రమో ప్రజలు ఎన్నికల్లోనే తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు పంపిన లీగల్ నోటీసులకు భయపడేది లేదని, అవసరమైతే న్యాయస్థానంలోనే పోరాడతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశంపై వస్తున్న ప్రచారాన్నీ ఆయన ఖండించారు. ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలుపై సమన్వయం కోసం కమిటీ ఏర్పాటు చేశామని, అందరూ కలిసి చర్చిస్తే మరింత మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సమన్వయ కమిటీకి ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి వివరించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తాము గౌరవిస్తామని అన్నారు.
సమన్వయ కమిటీ సమావేశంలో అందరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారని తెలిపారు. సమావేశం రౌండ్ టేబుల్ విధానంలో జరిగిందని, టేబుల్ ఆకారం కారణంగా ఫొటోల్లో కొందరు మధ్యలో కూర్చున్నట్లు కనిపించిందని వివరణ ఇచ్చారు. సమావేశాన్ని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ప్రోటోకాల్ ప్రకారమే నిర్వహించారని చెప్పారు.తనపై ఆడియోలు, వీడియోలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా మహేష్ కుమార్ గౌడ్ ఖండించారు. నిజంగా అలాంటి ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీలో దొంగచాటుగా ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి లేదని, ఏ విషయం ఉన్నా ముఖాముఖిగానే మాట్లాడుకుంటామని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసిన ఆయన.. రోజూ సీఎంతో ఫోన్‌లో మాట్లాడుతుంటానని, నిన్న కూడా మాట్లాడానని తెలిపారు. కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం బాగానే ఉందని, తాను సీఎం నాయకత్వంలోనే పనిచేస్తున్నానని చెప్పారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలను కూడా మహేష్ కుమార్ గౌడ్ తప్పుబట్టారు. అర్వింద్, బండి సంజయ్ వ్యాఖ్యలకు విలువ లేదని విమర్శించారు. నాయకత్వానికి ఎత్తు ప్రమాణం కాదని, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి కూడా పొట్టిగా ఉన్నప్పటికీ దేశాన్ని సమర్థంగా నడిపారని గుర్తు చేస్తూ వ్యక్తిగత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

# భద్రాచలం—వాజేడు రహదారికి త్వరలో మోక్షం?

- **వారం రోజుల్లో పనులు మొదలు పెట్టకపోతే కాంట్రాక్టర్ మార్పు కోరిన మంత్రి తుమ్మల.**
- **రూ.115.28 కోట్లతో 112.6 కి.మీ. రహదారి అభివృద్ధికి వేగం పెంచాలని అధికారులకు ఆదేశాలు.**

**భద్రాచలం, మహా:** భద్రాచలం నుంచి వాజేడు వరకు అధ్వాన్నంగా మారిన రహదారి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి దుస్థితిని చూసిన స్థానికులు మంత్రిని అడ్డుకుని తమ సమస్యలను వివరించగా.. వెంటనే స్పందించిన ఆయన ఆంధ్రప్రదేశ్ రోడ్లు-భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో ఆర్‌అండ్‌బీ మంత్రిగా ఉన్న సమయంలో ఈ రహదారి నిర్మాణం జరిగిందని, అనంతరం ఏళ్లుగా మరమ్మతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు మంత్రికి వివరించారు. కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికి మూడు గంటల సమయం పడుతోందని, రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ఆంధ్రప్రదేశ్ ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రహదారి



అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు మంజూరైనా కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం ఆందోళనకరమన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని మంత్రి జనార్దన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.భద్రాచలం-వాజేడు రహదారి అభివృద్ధి పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. భద్రాచలం నుంచి ఏటపాక వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 7.8 కిలోమీటర్ల రహదారిని రూ.3.70 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఏటపాక నుంచి చర్ల మండలంలోని సుబ్బంపేట వరకు 56.8 కిలోమీటర్ల మేర భద్రాద్రి డివిజన్ పరిధిలో రూ.67.58 కోట్లతో పనులు చేపట్టనున్నారు. సుబ్బంపేట నుంచి వాజేడు వరకు ములుగు డివిజన్ పరిధిలోని 48 కిలోమీటర్ల రహదారిని రూ.44 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. మొత్తం 112.6 కిలోమీటర్ల పొడవున రూ.115.28 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు అమలు కానుంది.ఈ పనులను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజినీర్ బీవీ రావు పర్యవేక్షించనుండగా, భద్రాచలం, ములుగు ఆర్‌అండ్‌బీ ఈఈలు క్షేత్రస్థాయిలో అమలు బాధ్యతలు నిర్వహించనున్నారు.భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తారని గుర్తు చేసిన మంత్రి తుమ్మల, రహదారి దుస్థితి వల్ల భక్తులు, స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందువల్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు.





# సూర్యుడి అరుదైన చిత్రాలు విడుదల

**హైదరాబాద్, మహా.** ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సౌర టెలిస్కోప్ డానియెల్ కె. ఇనోయే సాయంతో శాస్త్రవేత్తలు సూర్యుడి ఉపరితలానికి సంబంధించిన అత్యంత స్పష్టమైన చిత్రాలను విడుదల చేశారు. ఈ చిత్రాల్లో సూర్యుడిపై ఏర్పడే సూక్ష్మస్థాయి ప్లాస్మా సుడిగుండాలు (వోర్టెక్స్‌లు) తొలిసారిగా స్పష్టంగా నమోదయ్యాయి. కెల్విన్‌హెల్మ్‌హోల్ట్జ అస్థిరతలు గా పిలిచే ఈ దృశ్యాలు సౌర పరిశోధనలో కీలక మైలురాయిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.వేగంగా కదిలే వేడి ప్లాస్మా, నెమ్మదిగా కదిలే ప్లాస్మాతో ఢీకొన్నప్పుడు ఈ తరహా అలలు, సుడిగుండాలు ఏర్పడతాయి. ఈ ప్రక్రియను శాస్త్రవేత్తలు ఎన్నో ఏళ్లుగా సిద్ధాంతపరంగా వివరించినప్పటికీ, సూర్యుడి ఉపరితలంపై ఇంత స్పష్టంగా వీటిని పరిశీలించడం ఇదే తొలిసారి. ఈ పరిశోధన ద్వారా సూర్యుడిలో అయస్కాంత శక్తి ఎలా పేరుకుపోతుంది, ఎలా విడుదలవుతుంది అనే అంశాలపై మరింత స్పష్టత లభించనుంది.

తెలుగు
మహా
special
శుక్రవారం,
హైదరాబాద్
07-08-2026



# వానలోనూ ఎంపీల నిరసన

**పార్లమెంట్ పదనిసలు**

మహా స్పెషల్ : సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, ఇక్రా చౌదరిలు అయోధ్య శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ విరాళాల గోల్‌మాల్‌పై వర్షంలోనూ నిరసన తెలిపారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, విపక్ష నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కూడా వర్షంలో తడిశారు.























## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిద్దాం

**రెవెన్యూ కలెక్టర్ వెంకా రెడ్డి**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 6 మహా:** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని యాదాద్రి భువనగిరి జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అంజి రెడ్డి, జిల్లా అధికారులు ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## అరూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక

**వలిగొండ ఆగస్టు 6 మహా న్యూస్ :** వలిగొండ మండలం ఆరూరు గ్రామంలో గురువారం యూత్ కాంగ్రెస్ నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది.యూత్ అధ్యక్షుడిగా ఎర్ర సాయి గౌడ్, ఉపాధ్యక్షులు పాక మహేష్ యాదవ్,జీనుకల మచ్చగిరి యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర మణిరాజ్ గౌడ్,జనరల్ సెక్రటరీ కొప్పుల మధు గౌడ్,జాయింట్ సెక్రటరీ బుర్ర శివ యాదవ్,సోషల్ మీడియా కన్వీనర్ బుర్ర శ్రీకర్ యాదవ్,కోశాధికారి చాడ రవి,వెంపటి శరత్,కార్యవర్గం సభ్యులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాక అధ్యక్షుడు బుర్ర నరసింహ,గ్రామ శాఖ ఉపాధ్యక్షులు బండారి మహిపాల్ రెడ్డి,గ్రామ ఉపసర్పంచ్ గొడ్డేటి సత్యం యాదవ్,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆవుల స్వామి,మత్స్యగిరి గుట్ట ధర్మకర్త దామెర అనంత చారి,వార్డు మెంబర్లు రేఖ మచ్చగిరి,వేముల అనిల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

- **అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ప్రిన్సిపల్ రాధిక**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 6 మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో జాబ్ మేళాను ఆగస్టు 7వ తేదీన ఎస్ కె ఎస్ ఎస్ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులకు వారి వారి అర్హతల మేరకు ఉద్యోగాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ జాబ్ మేళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం నూతన భవనం నల్ల కంచె, వినోబా నగర్ లో ఆగస్టు 7 (నేడు) ఉదయం 11 గంటలకు నిర్వహించబడును. హాజరయ్యే అభ్యర్థులు తమ ఎస్ ఎస్ సి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్స్ జిరాక్స్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలకు సంబంధించిన పత్రాలను తమ వెంట తెచ్చుకోగలరు. జాబ్ మేళాతో పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ అభ్యర్థులకు ఒక మంచి అవకాశం అని అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు పొందాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.




## బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఆదేశించారు. ఈ నెల 9న ఉప్పల్ నియోజకవర్గంలోని కుషాయిగూడ, చర్లపల్లి, ఏఎస్‌రావు నగర్, కాప్రా, మల్లాపూర్, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ల పరిధిలో బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆయన వివిధ ఆలయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతులను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, దోమలు, ఈగల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని చెప్పారు. ఉత్సవాల సమయంలో అన్ని శాఖల అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. బోనాల ఉత్సవాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పండుగను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.ఇప్పటికే పలు ఆలయాల కమిటీ సభ్యులు, ధర్మకర్తలు ఎమ్మెల్యేను కలిసి బోనాల ఉత్సవాలకు ఆహ్వానించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించగలమని బండారు లక్ష్మారెడ్డి అన్నారు.

## ఆలయాలకు బోనాల చెక్కుల పంపిణీ

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన బోనాల చెక్కులను గురువారం హబ్సిగూడలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులకు చెక్కులను అందజేసిన అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక



దృష్టి సారిస్తున్నామని, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.

## పాలనలో నాణ్యత పెంచాలి

**టిజిఐసి వర్క్ షాప్ లో కలెక్టర్ రాజర్షిషా సూచనలు**




**ఆదిలాబాద్ మహా:** దైనందిన విధుల్లో ఎదురయ్యే సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలను అన్వేషిస్తూ, సృజనాత్మక ఆలోచనలతో పాలనలో నాణ్యతను పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక సామర్థ్య పెంపు వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ అధికారులు సాంకేతిక ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించే సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా మార్చడానికి నూతన ఆలోచనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి శాఖలోనూ సమస్యల పరిష్కారానికి వినూత్న మార్గాలను అన్వేషించాలని, తద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా టిజిఐసి ప్రతినిధులు వేర్వేరు రంగాల్లో సాధించిన నూతన ఆవిష్కరణలు, వినూత్న పనితీరు విధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో జడ్పీ సీఈఓ రవి, డిఆర్‌డిఓ రవీందర్, డిపిఓ రమేష్, టీహబ్ మేనేజర్ అంకిత, జిల్లా కోఆర్డినేటర్ నిఖిని వర్మ, ఈడిఎం రవి, టీవర్క్స్ అసోసియేట్ అరవింద్, జైకా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝూన్సీ, అగ్‌హబ్ మేనేజర్ ముకేశ్, టీజీఐసీ కమ్యూనికేషన్స్ లీడ్ సాహిల్, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ లీడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీడీవో కార్యాలయంలో జయశంకర్ జయంతి

**వలిగొండ ఆగస్టు 6 మహా న్యూస్** : వలిగొండ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కీశే తెలంగాణ సిద్ధాంతకర్త కొత్తపల్లి జయశంకర్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఎంపీడీవో జలంధర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు జయశంకర్ సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ వై ప్రేమలత సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ జూనియర్ అసిస్టెంట్ సిద్ధార్థ ఈజీఎస్ సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఆపద్బాంధవుడిలా పోలీసులు నిలవాలి

- **డయల్ 112 ఫిర్యాదుకు తక్షణమే స్పందించాలి**
- **బాధితులకు న్యాయం అందించాలి**
- **సమావేశంలో సిబ్బందికి ఎస్పీ సూచనలు**



**ఆదిలాబాద్ మహా :** ప్రజలకు ఆపదలో ముందుగా గుర్తుకొచ్చేది పోలీసు వ్యవస్థేనని, డయల్ 112కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి క్షణాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు రక్షణగా నిలవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ అధికారులకు సూచించారు.గురువారం ఆదిలాబాద్ పట్టణం లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డయల్ 112, బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బందితో జిల్లా ఎస్పీ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఫిర్యాదు అందిన వెంటనే బాధితులను ఫోన్ ద్వారా సంప్రదించి పోలీసులు వస్తున్నారని భరోసా కల్పించాలన్నారు. సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు సమస్యను పరిష్కరించిన అనంతరం నిర్దేశిత విధానంలో వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యటిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, సైబర్ నేరాలు, సీసీటీవీల ఏర్పాటు, ప్రస్తుత నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓపెన్ డ్రింకింగ్, రౌడీ షీటర్ల తనిఖీలు, గ్రామాల సందర్శనలు, పోలీసు మీకోసం కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ఫింగర్‌ప్రింట్ పరికరాలతో అనుమానాస్పద వ్యక్తుల తనిఖీలు, చెక్‌పోస్టుల తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. పాయింట్ బుక్స్, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి నేర నియంత్రణకు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. మండలాలు, పట్టణాల్లో పేకాట, గంజాయి, అక్రమ ప్రభుత్వ రేషన్ బియ్యం రవాణా, నకిలీ విత్తనాలు, కల్తీ పురుగుమందులు తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పక్కా సమాచారం సేకరించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి సమస్యను పెద్దది కాకముందే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల నమ్మకమే పోలీసు వ్యవస్థకు బలమని, విధుల్లో నీతి, నిజాయితీ, సేవాభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని ఎస్పీ పేర్కొన్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డయల్ 112, బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులతో అభినందించారు.ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, డీసీఆర్‌బీ ఎస్ఐ ప్రవీణ్, కమ్యూనికేషన్ ఎస్ఐ గణేష్, డయల్ 112, బ్లూ కోల్ట్, పెట్రోల్ కార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఐదు దశాబ్దాల నిరీక్షణకు తెర

**తీరిన రైతు భూ సమస్య**
**సంతోషంతో పాలాభిషేకం**

**ఆదిలాబాద్ మహా :** ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమికి హక్కు పత్రాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతు కుటుంబానికి ఎట్టకేలకు న్యాయం జరిగింది.సాత్నాల మండలం మేడిగూడ గ్రామానికి చెందిన భావనే పార్వతీబాయికి మాంగుర్ల శివారులోని పాత సర్వే నంబర్ 35లో పట్టా మంజూరైనప్పటికీ, క్షేత్రస్థాయిలో భూమి స్వాధీనం చూపించకపోవడంతో దాదాపు 50 ఏళ్లుగా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే ఈ సమస్యను గత నెలలో ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచన మేరకు జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సమగ్ర సర్వే నిర్వహించి రైతుకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అధికారులను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, పాత సర్వే నంబర్ 35లోని పట్టాను రద్దు చేసి, ప్రస్తుతం రైతు సాగు చేస్తున్న సర్వే నంబర్ 59లోని 4 ఎకరాల భూమిని అధికారికంగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో అర్ధ శతాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో రైతు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు , ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , జిల్లా కలెక్టర్ రాజర్షి షా చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాత్నాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఆచార్య జయశంకర్ కు ఘన నివాళి

నిర్మల్ మహా: తన జీవితమంతా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ కొనియాడారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని ఉద్యోగులు, మేధావులు, కళాకారులకు, తెలంగాణ ప్రజానీకానికి తెలియజెప్పి, స్వరాష్ట్ర ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ కలలుగన్న తెలంగాణ రాష్ట్రాన్ని అధికారులు సమిష్టి కృషితో అభివృద్ధి చేసినప్పుడే ఆయనకి ఘనమైన నివాళి అన్నారు. తెలంగాణ జాతి హితం కోసం ఎన్నో రచనలు చేశారని గుర్తు చేశారు. ఇలాంటి మేధావుల జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. నేటి తరం వారికి ప్రొఫెసర్ జయశంకర్ గొప్పతనాన్ని తెలియజేయాలని తెలిపారు. ఆచార్య జయశంకర్ ఆలోచనలు మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ జయంతి వేడుకలలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సి కార్పొరేషన్ శంకర్, డిఈఓ భోజన్న, జిల్లా ఖజానా అధికారి సరోజ, ఎల్డిఎం రామ్ గోపాల్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ భావజాల వ్యాప్తికర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జయశంకర్ చిత్రపటానికి కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల వారు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి జయశంకర్ దిశానిర్దేశం చేశారని కొనియాడారు. స్వరాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేస్తూ ప్రజలను, విద్యార్థులను చైతన్యపరిచారన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అధికారులందరూ ఆయన స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే నిజమైన నివాళి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, డిఆర్ఓ స్రవంతి, ఏవో వర్ణ, జిల్లా బీసీ సంక్షేమాధికారి డి. సోనియా, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

**బెల్లంపల్లి, మహా:** వార్షిక తనిఖీలలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంచిర్యాల జోన్‌లోని బెల్లంపల్లి సబ్‌డివిజనల్ (ఏసీపీ) కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు .ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవవందనం సమర్పించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణను పరిశీలించి, ఏసీపీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న కేసులు,వాటి పురోగతి, నిందితుల అరెస్టులు, ఎస్సీ/ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద నమోదైన కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, ఆలస్యానికి గల కారణాలను ఏసీపీని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను ాణ్యతతో కూడిన దర్యాప్తు నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,ప్రజల్లో పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా విజిబుల్ పోలీసింగ్ స్పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని, నేరాల నియంత్రణకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రౌడీషీటర్లు,హిస్టరీషీటర్ల పై ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.సివిల్ భూ వివాదాల్లో పోలీసులు అనవసర జోక్యం చేసుకోకుండా చట్టపరమైన విధానాల ప్రకారమే వ్యవహరించాలని, రౌడీయిజం, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా సమర్థవంతంగా విధులునిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని,వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు. సిబ్బందికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.అనంతరం పోలీస్ కమిషనర్ పోలీసు అధికారులతో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తో పాటు బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాస రావు ,రూరల్ సీఐ హనోజ్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ జయశంకర్ పోరాట స్ఫూర్తి తెలంగాణకు చిరునామ

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** ప్రత్యేక తెలంగాణ కోసం అహర్నిశలు పోరాడి తుది శ్వాస వరకు తెలంగాణ కోసం పని చేసిన ప్రత్యేక తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్రను మరువలేమని, ఆయన తెలంగాణ పోరాట స్ఫూర్తి పటిమకు చిరునామ అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం సైనిక్ పురిలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ కోసం జయశంకర్ తెలంగాణ వ్యాప్తంగా ప్రతి పల్లె పల్లె తిరిగి ప్రజా సమస్యలపై తెలంగాణపై పలు అధ్యయనాలు జరిపి తెలంగాణ ఉద్యమానికి తెలంగాణ ప్రజాస్వామిక ఉద్యమాలకు బీజం పోశాడని బండారు లక్ష్మారెడ్డి గుర్తు చేశాడు. మలిదశ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నేతృత్వంలో మరింత ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని తెలంగాణ వానిని తెలంగాణ భావజాల వ్యాప్తికి. ఢిల్లీకి వినిపించిన ఘనత కేసిఆర్ జయశంకర్ కె దక్కుతుందని ఆయన లేని లోటు తెలంగాణకు కనిపిస్తుందన్నారు. ప్రాణాంతకమైన వ్యాధితో ప్రొఫెసర్ జయశంకర్ బాధపడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక మధ్యలో లేకపోవడం విచారకరమన్నారు. తెలంగాణ అభివృద్ధిలో జయశంకర్ పాత్ర ఉంటే మరింత తెలంగాణ అభివృద్ధిని సాధించేదని అన్నారు. జయశంకర్ స్ఫూర్తి ఆయన పోరాటం ఆయన జీవన విధానం కమిట్మెంట్ రేపటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. జయశంకర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని బండారు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

# తన ప్రేమ పెళ్లికి తండ్రి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నుంచి ప్రాణహాని ఉంది

- నెలరోజులుగా అత్తవారింట్లో ఉంటున్న సంతోష్ గౌడ్
- అత్తరూపా రెడ్డి ఇంటిపై 40 మంది రౌడీలతో దాడి చేయించారు
- తన తండ్రి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై సంచలన ఆరోపణలు




**రాజేంద్రనగర్ మహా :** ప్రేమించిన అమ్మాయినిపెళ్లి చేసుకుంటున్నాందుకు తన తండ్రి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నుండి తన అత్త రూపా రెడ్డి కుటుంబానికి ప్రాణహాని ఉందని ఎమ్మెల్యే కుమారుడి సంతోష్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు.తన తండ్రి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నుండి తనకు తన కాబోయే భార్య కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ గురువారం మీడియాను ఆశ్రయించారు. తమకు తన కాబోయే భార్య కుటుంబానికి ఏమి జరిగిన తన తండ్రి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కారణం అన్నారు. మణికొండకు చెందిన బిఆర్ఎస్ నాయకురాలు రూపా రెడ్డి కూతుర్ని ప్రేమించాను, నిశ్చితార్థం కూడా జరిగింది. పెళ్లికి తన ఇంట్లో పెద్దలు అంగీకరించలేదు. ఇంటిని వదిలిపెట్టి నెల రోజులుగా తన అత్త రూపా రెడ్డి ఇంట్లోనే ఉంటున్నాను. గత కొన్ని రోజుల నుంచి అత్త రూప రెడ్డి కుటుంబాన్ని తన తండ్రి అనుచరులు పలు విధాలుగా కేసులతో మానసికంగా, వేధిస్తున్నారు. ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని పలు కేసులు నమోదు చేశారు. 40 మంది రౌడీలతో అత్త రూపా రెడ్డి ఇంటిపై దాడికి ప్రయత్నించారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుమారుడు సంతోష్ గౌడ్ ఆరోపించారు. ఏ క్షణమైనా తనను చంపే ప్రమాదం ఉందని, తనకు, తన కాబోయే భార్య కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.



# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేము..

**బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్...**

**రాజేంద్రనగర్ మహా;** రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జై శంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ జై శంకర్ 92 వ జయంతి సందర్భంగా ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశం లో మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. నియోజక వర్గ ఇంచార్జ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ తెలంగాణకు స్ఫూర్తినిచ్చిన దార్శనికుని స్మరణ తెలంగాణ ఉద్యమం పట్ల ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ మెరుగైన తెలంగాణ దిశగా సామూహిక ప్రయాణంలో ఆయన దార్శనికత మనందరికీ మార్గదర్శకంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**వేడుకల ఏర్పాట్లు పై జిల్లా కలెక్టర్ సమీక్ష**

వరంగల్, బ్యూరో మహా; ఖిలా వరంగల్ ఖుష్ మహల్ వేదికగా ఆగస్టు 15,2026 న పంద్రాగస్టు వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల నిర్వహణ, వేదిక ఏర్పాట్లు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్, భద్రత, వైద్య సదుపాయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్ జడ్పీ సీఈవో రాంరెడ్డి, డియార్వో విజయలక్ష్మి వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తల్లి పాల తోనే పిల్లలకు శ్రేయస్కరం

**అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న**

**బెల్లంపల్లి, మహా:** తల్లి పాల తోనే పిల్లలకు శ్రేయస్కరం అని అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న పేర్కొన్నారు. గురువారం రోజు 31 వార్డు హనుమాన్ బస్తి 1 సెంటర్ లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న,కౌన్సిలర్ బండారి స్రవంతిలు హాజరై మాట్లాడుతూ గర్భిణీలకు బాలింతలకు తల్లి పాలు తాగడం వలన పిల్లలు ఆరోగ్యవంతులుగా పెరుగుతారని తల్లికి బిడ్డకు అనుబంధం పెరుగుతుందని తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ లాంటి అనారోగ్య పరిస్థితులు దూరం అవుతాయని తెలిపారు. బాలింతలకి బ్రెడ్, అరటి పళ్ళు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి అంగన్వాడి టీచర్లు స్వరూప, రాజేశ్వరి, పద్మావతి, భారతి, కనక తార, సుజాత విజయలక్ష్మి తో పాటు ఆయా సునీత , లయన్స్ క్లబ్ మెంబర్లు,లబ్ధిదారులు పాల్గొన్నారు .

# తెలంగాణ మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి.**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం సమీకృత జిల్లా కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆచార్య జయశంకర్ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఉద్యమానికి మార్గదర్శకుడిగా, సలహాదారుడిగా విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచి రాష్ట్ర సాధన కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు, అసమానతలపై పోరాటం చేసి తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహోన్నత వ్యక్తిగా ఆయన నిలిచారని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. అధ్యాపకుడిగా అనేక మంది విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ వృత్తిపట్ల నిబద్ధత, సమాజం పట్ల బాధ్యత, తెలంగాణ పట్ల అంకితభావాన్ని పెంపొందించారని కలెక్టర్ అన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే శక్తి... చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే శక్తి కలిగిన సాధనమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను పొందేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్య అనేది కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం కాకుండా జ్ఞానం, విలువలు, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించే సాధనంగా ఉండాలని పేర్కొన్నారు. పిల్లలు తమ ఆశయాలను సాకారం చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని, ప్రతి చిన్నారి విద్యాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో చైతన్యపరిచి, రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా ఆయన చేసిన కృషి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశురాం, వెనుకబడిన సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైరల్ హెపటైటిస్ నియంత్రణ కు
# సమన్వయంతో పనిచేయాలి

- హెపటైటిస్ వ్యాధి పై విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్, బ్యూరో మహా:** జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమం అమలులో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన గురువారం జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, హైరిస్క్ గ్రూపులకు హెపటైటిస్‌బి వ్యాక్సినేషన్ ను పూర్తి స్థాయిలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే హెపటైటిస్‌ఎ, హెపటైటిస్‌ఈ, వ్యాప్తి ని నివారించేందుకు తాగునీటి వనరుల క్లోరినేషన్‌ను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. హెపటైటిస్ లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, రక్తదాతలకు తప్పనిసరిగా హెపటైటిస్ స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. హైరిస్క్ గ్రూపులతో పాటు సాధారణ ప్రజల్లో కూడా హెపటైటిస్ వ్యాధి పై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేసి, వ్యాధి నివారణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దామోదరి, జిల్లా వైరల్ హెపటైటిస్ నోడల్ అధికారి డాక్టర్ ఉష, డీసీహెచ్ఎస్ వర్ధన్నపేట డాక్టర్ రాంమూర్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓ వర్ధన్నపేట డాక్టర్ రాజమౌళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, బ్లడ్ బ్యాంక్ వైద్య అధికారి డాక్టర్ సంయుక్త, సభ్యులు స్వప్న మాధురి, లైలా, చందు, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వో ప్లాంట్ కు తాళం.. ప్రజలకు కలుషిత నీరే శరణ్యం

- కిష్టారం అంబేద్కర్ నగర్ లో ప్రారంభం కాని ఆర్వో ప్లాంట్ తీరుపై బీజేపీ ఆగ్రహం



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీలో సింగరేణి సేఫ్ నిధులతో నిర్మించిన ఆర్వో తాగునీటి ప్లాంట్ పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి గుత్తేదారులకు బిల్లులు చెల్లించినప్పటికీ, నేటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని భారతీయ జనతా పార్టీ నాయకులు విమర్శించారు. ప్లాంట్ పనిచేయకపోవడంతో గ్రామస్తులు కలుషిత నీటినే తాగాల్సిన పరిస్థితి నెలకొని, వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్‌రావు మాట్లాడుతూ, లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ నిరుపయోగంగా మారడం దురదృష్టకరమని అన్నారు. వెంటనే ప్లాంట్‌ను పునరుద్ధరించి గ్రామస్తులకు సురక్షిత తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని పేర్కొంటూ కిష్టారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా సమస్యలను వివరించి, వెంటనే బ్లీచింగ్ చల్లడం, దోమల మందు స్ప్రే చేయడం, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు, గ్రామ కార్యదర్శి స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సింగరేణి సేఫ్ నిధులు, డీఎంఎఫ్‌టీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై స్పందించకపోతే సింగరేణి ప్రభావిత ప్రాంతమైన అంబేద్కర్ నగర్, బీసీ కాలనీల ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మీనారాయణ, జిల్లా నాయకుడు మేరుగు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్య జయశంకర్‌కు నివాళి

**యాదాద్రి భువనగిరి, మహా:** ఆచార్య జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడుతూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జీవితాంతం ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన సిద్ధాంతకర్తకు ఘన నివాళులు అర్పించారు.

# డంపింగ్ యార్డు,డి.ఆర్.సీ.సి. లేనప్పుడు... 22 లక్షల వెయిబ్రిడ్జి, బేలింగ్ మెషిన్ ఎందుకో..!?

- బెల్లంపల్లి మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగంపై ప్రజల ఆగ్రహం
- నిరుపయోగంగా హైడ్రాలిక్ వర్టికల్ బెయిలింగ్ మిషన్
- కమీషన్ల కోసమే కొనుగోలు చేశారని వెల్లువెత్తుతున్న ఆరోపణలు




**మంచిర్యాల, మహా:** బెల్లంపల్లి మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు,డి.ఆర్.సీ.సి. లేనప్పుడు...22 లక్షల వెయిబ్రిడ్జి, బేలింగ్ మెషిన్ లు కొనుగోలు చేయడం ఎందుకో మరి..!? మున్సిపాలిటీ పాలక కమిటీ లేని సమయంలో కమిషనర్, ఇంజనీర్లు ఇతర అధికారిక సిబ్బంది అత్యుత్సాహం, అనాలోచిత నిర్ణయం తీసుకున్న తీరుపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక నిధుల దుర్వినియోగం జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై మహా దినపత్రిక ప్రత్యేక కథనం....

**ఏం జరిగింది..?**

బెల్లంపల్లి మునిసిపాలిటీలో దాదాపు 55 వేల నుండి 60 వేల మేరకు జనాభా కలిగి ఉందని అంచనా. ఈ జనాభాను అధికారులు 34 వార్డులుగా విభజించారు. మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో అధికారులు అత్యుత్సాహం చూపి,డంపింగ్ యార్డు,డి.ఆర్.సీ.సి. లేకున్నప్పటికీ వేబ్రిజ్, హైడ్రాలిక్ వర్టికల్ బెయిలింగ్ మిషన్ ఏర్పాటు కోసం 27 లక్షలతో టెండర్ ప్రకటన వేసినట్లు సమాచారం. ఇలా వేసిన టెండర్ ను ఓ కాంట్రాక్టర్‌కు దాదాపు 22 రూపాయలకు దక్కించుకున్నట్లు సమాచారం.

పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఆ యంత్రాలను కొనుగోలు చేసి మున్సిపల్ అధికారులకు అప్పగించినట్లు విషయం తెలిసిందే. ఆ తర్వాత యంత్రాలను అధికారులు లాంచలంగా ప్రారంభించారు. ఈ యంత్రాలు వార్డుల వారిగా సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించి, అక్కడ బెయిలింగ్ మిషన్ సహాయంతో కుదించి బయటకు పంపించాలి. కానీ పట్టణంలో డంపింగ్ యార్డే లేకపోవడంతో కొన్న మిషన్ ఇప్పుడు నిరుపయోగంగా మున్సిపాలిటీ పాత వాహనాల షెడ్డులో పడి ఉండడం గమనార్హం.

**కమీషన్ల కోసమేనా..?**

అయ్యా మున్సిపాలిటీ కమిషనర్ డంపింగ్ యార్డ్ లేకుండా వేబ్రిజి, హైడ్రాలిక్ వర్టికల్ బెయిలింగ్ మిషన్ ఎందుకు కొన్నారో ..? చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి వృధాగా ఉన్నా, డంపింగ్ యార్డ్ కోసం స్థలాన్ని ఎందుకు కేటాయించలేదని అధికారులను, పాలక పార్టీ నేతలను ప్రజలు నిలదీస్తున్నారు.

**పట్టణ ప్రజల డిమాండ్**

ఈ వ్యవహారంపై సి.డి.ఎం.ఏ, డి.ఎం.ఏ, జిల్లా కలెక్టర్, పాలక కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఇతర పార్టీలకు చెందిన నేతలు, స్వచ్ఛంద సంస్థలు తక్షణమే ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం ఇలా వృధా చేయడం సరికాదని, మున్సిపాలిటీ అధికారులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ భూమిలో నేతల పాగా

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ భూమి వందల ఎకరాలలో ఉందని తెలుస్తోంది. ఇంతకు క్రితం ఈ భూములు సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధీనంలో ఉండేవి. ఇక్కడ బొగ్గు నిల్వలు చివరి దశకు చేరడంతో సింగరేణి యాజమాన్యం లీజుకు తీసుకున్న భూములను ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు సమాచారం. అయితే ఆ భూములలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు తలో కొంత కబ్జా చేశారనే వదంతులు కూడా పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



# టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షునికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఉద్యోగులు

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 6 మహా:** ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ కు, టీఎన్జీవోస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊటు యశ్వంత్, శ్రీనివాసరావులు, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర నాన్ గెజిటెడ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు, మారం జగదీశ్వర్... ఉద్యోగుల హక్కులకై ఎల్లప్పుడూ కృషి చేయడం జరుగుతుందని, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఉద్యోగులు పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని కొత్వాల్‌గూడ డివిజన్ హుడా కాలనీలో ఆషాఢ బోనాల సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 119 డివిజన్ అధ్యక్షుడు కోణమొల్ల శ్రీనివాస్‌తో పాటు మంచర్ల మోహన్‌రావు, చిల్కమర్రి పరందాములు, మురళి గౌడ్, గుంటి చరణ్, సాగర్, శివ గౌడ్, మాదపతి నరేంద్ర, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# జనహిత సేవా సమితి అన్నదానం

**బెల్లంపల్లి, మహా:** జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్న దాన కార్యక్రమం 425 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం గురువారం రోజు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 425 వ సారి దాత కీ.శే. సూర దినేష్ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు యాచకులకి, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా సుమారు 180 మందికి భోజనం అందించడం జరిగిందని జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ పేర్కొన్నారు. జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కొరకు మరింత మంది దాతలు ముందుకు రావాలని అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నిచ్చకోల వంశీ, దాత కుటుంబ సభ్యులు మరియు మిత్రులు జనహిత సేవా సమితి కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్ కార్యవర్గ సభ్యులు నిచ్చకోల గురుస్వామి,ఎల్లాల పోశం, బోనాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## సేంద్రీయ వ్యవసాయానికి పెద్దపీట

- పంట మార్పిడి విధానాలపై అవగాహన
- రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

**నిర్మల్ మహా :** రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయ సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులతో కలిసి సేంద్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, ఉద్యానవన పంటల సాగు, ప్రభుత్వ ప్రోత్సాహం, రైతుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సేంద్రీయ సాగుపై దృష్టి పెట్టాలని, సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి పంట మార్పిడి విధానాలను విధిగా పాటించాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ పంటల ఉత్పత్తుల నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక విధివిధానాలను రూపొందిస్తోందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రీయ ఉత్పత్తులకు అద్భుతమైన డిమాండ్ ఉందని, రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులకు సరిపడినంత ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోడు భూముల సమస్యలు, మార్కెటింగ్ సదుపాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో పంట మార్పిడి విధానాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని దాదాపు 2 లక్షల మంది రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, సోయా, కందులు వంటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, పూల సాగు వంటి ఉద్యానవన రంగం వైపు రైతులను మళ్లిస్తున్నట్లు చెప్పారు. శ్రీరాంసాగర్, కడెం, గడ్డెన్న వాగు, స్వర్ణ ప్రాజెక్టుల కింద జిల్లాలో సాగు విస్తీర్ణం విస్తారంగా ఉందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం దాదాపు 20 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు జరుగుతుండగా.. ఇందులో 8,300 ఎకరాల్లో ఆయిల్ పామ్, 5 వేల ఎకరాల్లో పసుపు సాగవుతున్నాయని వివరించారు. ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. రెవెన్యూ మ్యాపులు లేని 14 గ్రామాల్లో దాదాపు 30 వేల ఎకరాలకు గాను సర్వే చేపడుతున్నామని, అలాగే మరో 70 గ్రామాల్లో 62 వేల ఎకరాల భూముల సర్వే పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. భూ భారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కె.వి.ఎన్. రెడ్డి, భవానీ రెడ్డి, రామ్‌గోపాల్ రెడ్డి, సునీల్ కుమార్, గంగాధర్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డి.ఎఫ్.ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## వినూత్న ఆలోచనలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

**పంచాయతీరాజ్& గ్రామీణ అభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్**




యాదాద్రి భువనగిరి ఆగస్టు 6 మహా : గ్రామాలు స్వయం సమృద్ధి సాధించి స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పరచుకునేలా వినూత్న ఆలోచనలతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్ సూచించారు.గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా అనంతారం గ్రామంలో నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళి అమలు కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి కమిషనర్ వెస్లీ, జాయింట్ కమిషనర్ నర్సింహులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలుపై అనంతారం గ్రామపంచాయతీ రూపొందించిన ప్రణాళికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్ మాట్లాడుతూ రాబోయే మూడు సంవత్సరాల గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను శాస్త్రీయంగా రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక రూపకల్పనలో వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, గ్రామ అవసరాలను ప్రజలతో చర్చించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను గుర్తించాలని తెలిపారు. గ్రామాల ఆర్థికాభివృద్ధికి సమగ్ర ప్రణాళికే పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీకి అందే నిధులను గ్రామాభివృద్ధికే వినియోగించాలని, జిపిడిపి కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు కావాలని స్పష్టం చేశారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వీబీజీ రామ్‌జీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు నిర్మించి ప్రతి నీటి చుక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల పెంపు, నీటి కొరత నివారణకు జల సంరక్షణ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతారం గ్రామంలో 63 సంఘ బంధాలు, 616 మంది సభ్యులు ఉన్నారని, స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రుణ సౌకర్యం అందించడం జరిగిందని తెలిపారు. అనంతరం అధికారులు గ్రామంలోని ఇళ్లలో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల యూనిఫాంలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు గ్రామంలో ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, అదనపు డీఆర్‌డీఓ సురేష్, అదనపు డీఆర్‌డీఓ (సెర్ప్) జంగారెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యా అధికారి భిక్షపతి,మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, సర్పంచ్ నాగరాణి, జిల్లా మరియు మండల సమాఖ్య అధ్యక్షులు, వార్డు సభ్యులు, సంఘ బంధ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం అంకితభావంతో చేసిన కృషి రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆయన చూపిన మార్గం ఆయన ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజ అభ్యున్నతి ప్రజా సంక్షేమం కోసం ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ప్రజాసేవలో ఉన్న అధికారులు ఉద్యోగులు మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉద్యోగులు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.



## క్షయ వ్యాధిని అరికట్టేందుకు సమిష్టి కృషి అవసరం

- కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య

**బెల్లంపల్లి, మహా**: క్షయ వ్యాధిని అరికట్టేందుకు సమిష్టి కృషి అవసరం అని కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య పేర్కొన్నారు.గురువారం రోజు బెల్లంపల్లి పట్టణంలోని శంశీరునగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాంతిఖనిలో టిబి ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం జిల్లా వైద్యాధికారి డాక్టర్.నరేందర్ రాథోడ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్. సుధాకర్ నాయక్ ఆదేశాలతో కార్యక్రమం నిర్వహించారు.కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య అక్కడ హాజరైన రోగులు, ప్రజలతో మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకై అవగాహన కల్పిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు తగిన జాగ్రతలు పాటించాలని దీంట్లో భాగంగా పోస్టర్లని అవగాహన కొరకు విడుదల చేసి ప్రజల ముందు ఆవిష్కరించారు.జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్ష ఉచితంగా చేయడం, క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్ని రకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో అవసరం ఉన్న వారికి అన్ని రకాల పరీక్షలు చేశారు. తెమడ పరీక్ష కోసం 8మందికి, హెచ్ఐవి,షుగర్ టెస్టులు, ఎక్స్ రే అవసరం ఉన్నవారికి 82మందికి ఇంటికి దగ్గరలోకి పోర్టబుల్ ఎక్స్ రే యంత్రం ద్వారా శాంతిఖని ప్రభుత్వ పాఠశాల దగ్గర ఎక్స్ రే తీయడం జరిగింది. ఈ శిబిరంలో స్థానిక 8వ వార్డ్ కౌన్సిలర్ నిజాముద్దీన్, డివిజన్ క్షయవ్యాధి సూపర్ వైజర్ శ్రీపెల్లి శశికాంత్,అకౌంటెంట్ మురళి, ఎఎన్ఎమ్ రాజేశ్వరి, ఆశవర్కర్లు రజియ,స్వరూప, గంగారాణి, ఐసిటిసి ఎన్జీవో కార్యకర్త కల్యాణ్, అగ్గు సౌందర్య తదితరులు సేవలందించారు.

## బిల్లులు ఆన్ లైన్ లోనే సమర్పించాలి

- జిల్లా ఖజానా అధికారి సరోజ వెల్లడి



**నిర్మల్ మహా** : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన కాగిత రహిత విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్ఎంఎస్ ద్వారా పేపర్‌లెస్ బిల్లుల సమర్పణ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని జిల్లా ఖజానా అధికారి సరోజ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ ఆదేశానుసారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధిన బిల్లులన్నిటినీ ఆగస్ట్ 15 వ తేదీ నుండి ఆన్లైన్ లో మాత్రమే సమర్పించాలని ఆమె వివరించారు. ఈ విధానం అన్ని ప్రభుత్వ శాఖలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా లోని అందరూ డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్స్ ఇకపై బిల్లులను ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. బిల్లులతో పాటు అవసరమైన స్కాన్ చేసిన ఆధార పత్రాలను తప్పనిసరిగా జత చేయాలని తెలిపారు. సమర్పించే పత్రాలన్నీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 ప్రకారం చెల్లుబాటు అయ్యే డిజిటల్ సంతకంతో ధృవీకరించాలని పేర్కొన్నారు.15 ఆగస్టు 2026 నుంచి ట్రెజరీ కార్యాలయాలకు హార్డ్ కాపీ బిల్లులను సమర్పించరాదని వివరించారు. జిల్లాలోని అన్ని ఉపకోశాధికారి కార్యాలయ అధికారులు తమ పరిధిలోని అన్ని కార్యాలయాలకు ఈ ఆదేశాలను తెలియజేసి అమలు చేయాలని ఆదేశించారు. ఈ నిర్ణయం ద్వారా బిల్లుల సమర్పణ, పరిశీలన, ఆమోద ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించబడుతుందని తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

- తెలంగాణకు 'సార్' చేసిన సేవలను కొనియాడిన ప్రిన్సిపాల్, బోధన, బోధనతర సిబ్బంది
- మహానేత చిత్రానికి చిత్రపటానికి పూలమాల వేసి స్మరణ



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గురువారం తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన నిర్వహించిన పాత్రను గురించి స్మరించుకున్నారు. ఆయన లేని లోటు తెలంగాణ ప్రాంతానికి ఎప్పటికీ తీరని లోటని పేర్కొన్నారు. అందరం ఆయన చూపిన బాటలో నడుస్తూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు....సార్ ఆశయ సాధనకు కృషి చేద్దాం...తెలంగాణ ప్రజలకు అందాల్సిన నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఆయన ఎంతగానో పరితపించారని వక్తలు గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్క తెలంగాణ పౌరుడు భాగస్వామ్యం కావాలని కోరారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు



## రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ సేవలు మరువలేనివి

- ఆదిభట్ల డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి
- ఆయన జయంతి సందర్భంగా సర్కిల్లో ఘన నివాళులు

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 6 మహా:** రాష్ట్ర సాధన కోసం సబ్బండ వర్గాలను ఏకం చేసి ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ సేవలు మరువలేనివని డిప్యూటీ కమిషనర్ అన్నారు. ఆదిభట్ల సర్కిల్ 15 పరిధిలోని రాగన్నగూడ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా, డిప్యూటీ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సబ్బండ వర్గాలను ఏకం చేసి ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ సేవలను గుర్తు చేశారు. వారి సేవలను స్మరించుకుంటూ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో అంకితభావంతో పని చేయాలని డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసులు, డిప్యూటీ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు స్వర్ణకుమార్, యోగేందర్, ఏఎంహెచ్ఓ శారద, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ షేక్ మల్లిక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ కు ఘన నివాళులర్పించారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**నివాళులు అర్పించిన బిజెపి జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్**



వరంగల్, మహా; ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం బిజెపి జిల్లా సీనియర్ నాయకులు గందె నవీన్ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు 28వ డివిజన్ లోని విశ్వకర్మ వీధి లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విశ్వకర్మ వీధి జంక్షన్ వద్ద గల జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సిద్ధాంతకర్త గా తెలంగాణ పితామహుడు"గా పేరుగాంచారని, తన జీవితాంతం తెలంగాణ ఆత్మగౌరవం, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతపై ప్రజలను చైతన్య పరచడానికి ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కనుకుంట్ల రంజిత్ బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, గ్రేటర్ వరంగల్ పట్టణ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కట్ట రాజేందర్,,వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరి చంద్రసేన, సంఘ సభ్యులు వంగళ బ్రహ్మానందం, కందుకూరి శ్రీధర్, రాజు, సామాజికవేత్త బండ్ల సురేందర్ మరియు శివనగర్ బిజెపి మండల అధ్యక్షులు ఎండి రఫీ, నాయకులు అకేన సాగర్, వంగల శ్రీనివాస్, చింతమహేందర్, కూచన మహోన్నత్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## నిర్ణీత గడువులోగా పరిపాలనా భవనాన్ని పూర్తి చేయాలి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**

**వరంగల్, బ్యూరో మహా :** జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న పరిపాలన భవన పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పరిపాలన భవనం బ్లాక్-సీ నిర్మాణం వల్ల ప్రభావితమవుతున్న మ్యూజియం ప్రహరీ గోడ భాగాన్ని పరిశీలించి, అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. మ్యూజియం ప్రాంగణంలో ఉన్న శిల్పాలను పురావస్తు శాఖ ద్వారా సురక్షితంగా తగిన ప్రదేశానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.కమిషనర్ వెంట సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోజా, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.



## ఆచార్య జయశంకర్ సేవలు, ఆశయాలు చిరస్మరణీయం

**జీడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న**

**బల్దియా లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు**

**వరంగల్, కార్పొరేషన్ మహా;**తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 93వ జయంతి సందర్భంగా బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి, స్వరాష్ట్ర సాధనకు జయశంకర్ చేసిన సేవలు, ఆయన ఆశయాలు చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, సీహెచ్ఓ లక్ష్మారెడ్డి, ఉప కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి, సమ్మయ్య, కార్యదర్శి అనిల్ బాబు, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, అకౌంట్స్ అధికారి శివ లింగం, సూపరింటెండెంట్ బాకం సంతోష్, అన్ని విభాగాల సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్ యాడ్‌తో రూ.33,500 టోకరా




**ఘట్కేసర్, మహా:** ఫేస్‌బుక్‌లో తక్కువ ధరకు సామ్‌సంగ్ ఎస్24 అల్ట్రా స్మార్ట్‌ఫోన్ ఇస్తామంటూ వచ్చిన ప్రకటనను నమ్మిన ఎదులాబాద్ గ్రామానికి చెందిన గుమ్మడి నవీన్ (28) రూ.33,500 సైబర్ మోసానికి గురయ్యాడు. జులై 13న ప్రకటనపై క్లిక్ చేసిన బాధితుడిని సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా సంప్రదించి, ఒక సంవత్సరం వారంటీతో రూ.30 వేలకే ఫోన్ ఇస్తామని నమ్మించారు. బుకింగ్ పేరుతో తొలుత రూ.500, అనంతరం మరో రూ.3,500, చివరకు పార్శిల్ డెలివరీ పేరుతో రూ.29,500 వసూలు చేశారు.పార్శిల్ అందుకున్న తర్వాత బాక్స్ తెరిచి చూడగా ఒరిజినల్ ఫోన్‌కు బదులుగా డూప్లికేట్ ఫోన్ ఉండటంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించాడు. డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పిన నిందితులు స్పందించకపోవడంతో బాధితుడు 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసి, ఘట్కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మి అపరిచితులకు ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## ఫత్వాతో వివాహ రద్దు చెల్లదు

**విడాకుల అధికారం కోర్టులకే.**

మసీదు కమిటీలకు లేదని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టీకరణ. భోపాల్, మహా: వివాహ రద్దు విషయంలో మతపరమైన సంస్థలు లేదా మసీదు కమిటీలు జారీ చేసే ఫత్వాలకు చట్టబద్ధత లేదని మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహ బంధాన్ని రద్దు చేసే అధికారం కేవలం రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టులకే ఉంటుందని స్పష్టం చేసింది. మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహం రద్దయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరిస్తూ, చట్టం నిర్దేశించిన విధానాన్ని అనుసరించి మాత్రమే విడాకులు పొందాలని పేర్కొంది. వివాహ బంధానికి సంబంధించిన వివాదాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కోర్టులకే ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో భోపాల్‌కు చెందిన 'దారుల్‌దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దయిందని ప్రకటించాలని కోరుతూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. అయితే, ఫత్వాకు స్వతంత్ర చట్టపరమైన గుర్తింపు లేదని, అది న్యాయస్థానం తీర్పుకు ప్రత్యామ్నాయం కాదని ధర్మాసనం స్పష్టం చేస్తూ అతని అభ్యర్థనను తిరస్కరించింది. అదే సమయంలో, విడాకులు కోరే ప్రతి వ్యక్తికి చట్టప్రకారం సంబంధిత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించే పూర్తి హక్కు ఉందని హైకోర్టు పేర్కొంది. వివాహ రద్దు పిటిషన్ దాఖలు చేస్తే, సంబంధిత నిబంధనల ప్రకారం ఫ్యామిలీ కోర్టు విచారణ జరిపి తగిన నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించింది. మతపరమైన ఫత్వాలు, వివాహ రద్దు ప్రక్రియకు సంబంధించిన చట్టపరమైన పరిమితులపై ఈ తీర్పు స్పష్టత ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వివాహ బంధం వంటి వ్యక్తిగత హక్కులకు సంబంధించిన అంశాల్లో రాజ్యాంగబద్ధమైన న్యాయవ్యవస్థకే తుది అధికారం ఉంటుందని హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది.

### ప్రజలకు చేరువయ్యే సమర్థవంతమైన
# పోలీసింగ్ సేవలు అందించాలి

- దొంగతనం కేసుల ఛేదన, కన్విక్షన్ రేటు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సైబర్ నేరాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- రాజన్న జోన్- 3 డిఐజి సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్



**వేములవాడ, మహా:** ప్రజలకు చేరువయ్యే సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందించాలనీ రాజన్న జోన్ 3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ అన్నారు. గురువారం సిరిసిల్ల పర్యటనలో భాగంగా ఎస్పీ మహేష్ బి. గితే స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ కార్యాలయ పరిసరాలు, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, డిజిటల్ డేటా నిర్వహణ, సాంకేతిక వినియోగంపై ఆరా తీశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల పనితీరు పట్ల రాజన్న జోన్3 డీఐజీ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఈసందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ,శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సైబర్ నేరాల నివారణ, పెండింగ్ కేసుల పురోగతి, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై సమగ్రంగా సమీక్షించారు.ముందుగా జిల్లా ఎస్పీ గారు డీఐజీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా జిల్లా భౌగోళిక స్వరూపం, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు, నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను వివరించారు.ఈసందర్భంగా డిఐజి మాట్లాడుతూ.ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పారదర్శక, జవాబుదారీతనం కలిగిన సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందనతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిఐజి అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ,శాంతిభద్రతల పరిరక్షణలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.జిల్లాలో నమోదవుతున్న దొంగతనం కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించి కేసులను త్వరితగతిన ఛేదించాలని సూచించారు.నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడే శాతాన్ని మరింత పెంచేలా పటిష్ఠమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు.జిల్లాలో కన్విక్షన్ రేటు మెరుగ్గా ఉండటం అభినందనీయమని పేర్కొంటూ,అందుకు కృషి చేసిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు.కోర్టు మానిటరింగ్ బృందం ప్రతి కేసును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, విచారణ సమయంలో సాక్షులు తప్పనిసరిగా కోర్టుకు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.జిల్లాలో అధికంగా నమోదవుతున్న సైబర్ నేరాలను విశ్లేషించి, వాటిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటును విస్తృతంగా ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో గ్రామ సర్పంచ్‌లు మరియు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి కనీసం 5 నుంచి 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాల తనిఖీల సమయంలో పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై వాహనదారులకు అవగాహన కల్పించి, వాటిని వెంటనే చెల్లించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి తన పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల పూర్తి వివరాలపై అవగాహన కలిగి ఉండాలని, పెట్రోలింగ్ సమయంలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అనుమానిత వ్యక్తులను తప్పనిసరిగా తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత కార్యకలాపాలపై నిఘా



ఉంచాలని ఆదేశించారు. అలాగే నమోదయ్యే ప్రతి కేసును సీసీటీఎన్ఎస్ లో నిర్దేశిత సమయంలోనే నమోదు చేసి అప్లోడ్ చేయాలని సూచించారు.జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉక్కుపాదం మోపాలని, గంజాయి సేవించే వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైతే వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించి సన్మార్గంలో నడిపించే చర్యలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛందంగా గంజాయి వినియోగాన్ని మానేసి డీఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందేందుకు ముందుకు వచ్చే వారిపై నమోదైన కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఐజీ గారు ఆదేశించారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీసు అధికారులు, సిబ్బంది వినియోగార్థం నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను డిఐజి సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు ఈసమావేశంలో డిఎస్పీ లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐలు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



**ఘట్‌కేసర్ , మహా :** ఘట్‌కేసర్ మండలం ఔషాపూర్ గ్రామంలో అక్రమ జూదం నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగదు పందెంగా పెట్టి పేకాట ఆడుతుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 06న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఔషాపూర్ గ్రామంలోని మహావీర్ రియల్ ఎస్టేట్ కాలనీలోని ఓ ఇంటి గదిలో కొందరు వ్యక్తులు నగదు పందెంగా పెట్టుకుని అక్రమంగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు.ఈ దాడిలో *కొత్త నరేందర్ (52), అలుసాని వీరేష్ (23), జిల్లాల మల్లికార్జున రెడ్డి (51)*లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ముగ్గురూ అక్రమ లాభం పొందే ఉద్దేశ్యంతో నగదు పందెంగా పెట్టుకుని జూదం ఆడుతున్నట్లు గుర్తించిన పోలీసులు, వారిని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ప్రజలు ఎలాంటి జూద కార్యకలాపాలకు పాల్పడకుండా చట్టాన్ని గౌరవించాలని, అక్రమ జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్‌కేసర్ పోలీసులు హెచ్చరించారు...



## భూముల రీసర్వే ను వేగవంతం చేయాలి

**హనుమకొండ జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ ఎన్ రవి**

హనుమకొండ మహా : హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ను మరింత వేగవంతం చేయాలని భూములు కొలతల శాఖ అధికారులు, సర్వేయర్ల ను హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ చాంబర్ లో భూముల రీసర్వే పురోగతిపై భూములు కొలతలు శాఖ అధికారులు, సర్వేయర్లు, లైసెన్సుడ్ సర్వేయర్లతో ఇన్చార్జి కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు .ఈ సమావేశంలో జిల్లాలోని 9 మండలాల్లో కొనసాగుతున్న భూముల రీ సర్వే ఎంతవరకు పూర్తయిందనే వివరాలను భూములు కొలతలు శాఖ అధికారులు, సర్వేయర్లను ఇన్చార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వేకు రైతులు సహకరిస్తున్నారని, భూ సమస్యలు పరిష్కారం అవుతుండడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని సర్వేయర్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే 9 మండలాలలో భూముల రీ సర్వే జరుగుతున్న జిల్లాగా హనుమకొండ జిల్లాకు గుర్తింపు ఉందని, కాబట్టి రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సర్వేయర్లు భూముల రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయడంలో లైసెన్సుడ్ సర్వేయర్ల సహకారం తీసుకోవాలన్నారు. భూముల రీ సర్వే తో భూ సమస్యలు తొలగి పోతుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారని, గ్రామాలలో రీ సర్వే బృందాలకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో భూములు కొలతల శాఖ ఏడి నూర్ సింగ్, డిఐలు సారంగపాణి, రాజనర్సయ్య, సర్వేయర్లు లైసెన్సుడ్ సర్వేయర్లు పాల్గొన్నారు.




## విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

- విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, బ్యూరో మహా ;** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు మోడల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించేందుకు జిల్లా, మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులను ఇంచార్జీలు గా నియమించి వారి పర్యవేక్షణ నివేదికల పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం జిల్లా కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో శుభ్రత, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం తో పాటు ఇతర మౌలిక సదుపాయాల అమలు తీరును జిల్లా కలెక్టర్ సమీక్షించారు.జిల్లాలోని 74 ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో బుధవారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమం లో భాగంగా ప్రత్యేక అధికారులు పరిశీలించి ఇచ్చిన నివేదిక పై సంబధిత అధికారులతో చర్చించి విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్ జడ్పీ సీఈవో రాంరెడ్డి, డియార్వో విజయలక్ష్మి,డి బి సి డి ఓ పుష్పలత, డిఎంఅండ్ హెచ్ ఓ రాజి రెడ్డి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణి లు, సంబంధిత శాఖల జిల్లా,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**వరంగల్, క్రైమ్ మహా;** తేదీ 5 8 2026 రాత్రి 23 30 గంటలకు వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ మొదటి గేటుకు ఎదురుగా ఉన్నసిటీ ఫార్మసీ మెడికల్ షాప్ ముందు జరిగింది. దీని పై తేదీ 6 8 2026 సాయంత్రం 16 00 గంటలకు ఫిర్యాదుదారు పి. శ్రీనివాస్, పిసి2495, ఎంజీఎం ఔట్ పోస్ట్, మాట్లాడి పిఎస్ సెల్: 9490097636 ఫిర్యాదు చేశారు. అందులో ఫిర్యాదు దారు తాను గత కొన్ని రోజులుగా ఎంజీఎం ఔట్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 8 2026న తాను డ్యూటీలో ఉండగా, ముందు రోజు అనగా 5 8 2026 న రాత్రి సుమారు 11 30 గంటలకు, వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ మొదటి గేటుకు ఎదురుగా ఉన్న సిటీ ఫార్మసీ మెడికల్ షాప్ ముందు, సుమారు 30 ఏళ్ల వయస్సు గల ఒక గుర్తు తెలియని పురుషుడు రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తున్నట్లు తనకు తెలిసిందని తెలిపారు. ఆ సమయంలో, ఎంజీఎం జంక్షన్ నుండి పోచమ్మ మైదాన్ జంక్షన్ వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం, నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు దాటుతున్న ఒక గుర్తు తెలియని పాదచారిని ఢీకొట్టిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ ధాటికి అతను తీవ్రంగా గాయపడి రోడ్డు పై పడిపోయాడు. అనంతరం, అటుగా వెళ్తున్నవారు గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే, 6 8 2026 తేదీ తెల్లవారు జామున సుమారు 12:40 గంటలకు, డ్యూటీలో ఉన్న డాక్టర్ అతను మరణించినట్లు ప్రకటించారు. మృతుడు గుర్తు తెలియని పురుషుడని, అతని వయస్సు సుమారు 30 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు, చర్మం ఎరుపు/తెల్లగా ఉంటుందని, అతని ఎడమ చేతి పై మూడు నక్షత్రాల పచ్చబొట్టు గుర్తుగా ఉందని ఆయన ఇంకా తెలిపారు. అందువల్ల, మరణించిన గుర్తు తెలియని పురుషుడి గుర్తింపును నిర్ధారించాలని, నేరానికి పాల్పడిన గుర్తు తెలియని వాహనాన్ని దాని డ్రైవర్ ను గుర్తించి, చట్ట ప్రకారం డ్రైవర్ పై తగిన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతూ ఆయన ఒక నివేదికను సమర్పించడం జరిగిందని మట్వాడ సబ్ ఇన్స్పెక్టర్ సాంబయ్య తెలిపారు.



## శ్రీ రామచంద్ర కళాశాలలో బోనాల పండుగ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) కొత్తగూడెంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలతోరణాలు రంగవల్లులు సంప్రదాయ అలంకరణలతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ బోనాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఐ.క్యూ.ఏ.సి.కో ఆర్డినేటర్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని భావితరాలకు అందించే బాధ్యతను స్వీకరించాలని సూచించారు. కళాశాల సాంస్కృతిక కమిటీ కోఆర్డినేటర్ ఎన్.విద్యాప్రవీణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.వనజ, పి.అనూరాధ, వెంకటేశ్వర్లు, పి.సుస్మిత, జి.మధు, అంజని, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, నవీన్, అరుణ, సుజిత, రంజిత్, ఏఓ శివజ్యోతి, దిలావర్, చక్రవర్తి, సైదులు, కార్తీక్, శశికళ, సరస్వతమ్మ, రాంకీ, శోభ, సంపత్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గోబర్ధన్ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

- రూ.23,731 కోట్లతో బయోగ్యాస్‌కు ఊతం.
- అస్సాంలో రూ.8,970 కోట్ల జాతీయ రహదారికి గ్రీన్‌సిగ్నల్.



**ఢిల్లీ, మహా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి మండలి సమావేశంలో ఇంధన భద్రత, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రూ.23,731 కోట్ల వ్యయంతో అమలు చేయనున్న 'గోబర్ధన్' (గ్యాల్వనైజింగ్ ఆర్గానిక్ బయోఅగ్రో రిసోర్సెస్ ధన్) జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అదే సమయంలో అస్సాంలో రూ.8,970 కోట్ల వ్యయంతో నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

202627 నుంచి 203536 వరకు అమలు కానున్న గోబర్ధన్ పథకం ద్వారా వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, ఇతర సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తిని భారీ స్థాయిలో పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఉన్న దేశీయ బయోగ్యాస్ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచి, దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించడం ద్వారా దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ పథకం అమలుతో రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు అదనపు ఆదాయ వనరులు లభిస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వ్యవసాయ వ్యర్థాలకు విలువ జోడించడం, గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం వంటి బహుముఖ ప్రయోజనాలు ఈ పథకం ద్వారా కలుగుతాయని పేర్కొంది. సేంద్రీయ వ్యర్థాల శాస్త్రీయ వినియోగం ద్వారా స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి పెరగడంతో పాటు కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా అస్సాంలో రూ.8,970 కోట్లతో నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో రహదారి అనుసంధానం మరింత మెరుగుపడటంతో పాటు రవాణా, వాణిజ్య కార్యకలాపాలకు వేగం చేకూరుతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా పెట్టుబడులు ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధికి ఊతమివ్వడం, ఉపాధి అవకాశాలు పెంచడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు.

ఇంధన స్వావలంబన, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది. గోబర్ధన్ పథకం, అస్సాం జాతీయ రహదారి ప్రాజెక్టులు దేశ ఆర్థికాభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల పురోగతికి కీలకంగా నిలుస్తాయని కేంద్రం అభిప్రాయపడింది.



## సమత మూర్తిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ శివప్రసాద్ శుక్ల దంపతులు

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరాంనగర్ లోని సమతా మూర్తిని గురువారం రాష్ట్ర గవర్నర్ శివప్రసాద్ శుక్ల దంపతులను ఆచార్యులు పూర్ణకుంభాభిషేకంతో స్వాగతం పలికారు. శ్రీ భగవద్రామనుజుల స్వర్ణ మూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ దంపతులు హారతీని వీక్షించారు. శ్రీ త్రిదండి చిన్న రామానుజ జీయర్ స్వామి,అహోబిలం స్వామీజీల మంగళ శాసనాలు, జ్ఞాపికలను అందించారు.





## భవిష్యత్తులో మరిన్ని పదవులను అలంకరించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా అతి చిన్న వయసులోనే అధిష్టానం ఆశీస్సులు పొందికొత్తగూడెం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించినలాల్ సింగ్ నాయక్ భవిష్యత్తులో మరిన్ని పదవులను అలంకరించాలని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ ఉద్ఘాటించారు.కొత్తగూడెం రెండవ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లి ములుగు జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ కొత్తగూడెం విచ్చేసిన సందర్భంగా తనకు సన్నిహితుడైన మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రతాప్, అభ్యుదయ కళా సేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు మాలోత్ అశోక్ బాబు, సంఘ నాయకులు రాజేశ్వరరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రామాయణ ట్రైలర్‌కు భారీ స్పందన..

### ఏఐ అప్‌డేట్‌తో మరింత ఆకట్టుకున్న వీడియో

బాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటైన 'రామాయణ' విడుదలకు ముందే భారీ చర్చకు దారి తీస్తోంది. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ దేశ విదేశాల్లో సినీ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది.ట్రైలర్ విడుదలైన కొద్ది రోజుల్లోనే వివిధ డిజిటల్ వేదికలపై కలిపి భారీ స్థాయిలో వీక్షణలు నమోదు కావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ట్రైలర్‌ను విస్తృతంగా పంచుకోవడంతో ఇది అనేక వేదికల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. దీంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తి మరింత పెరిగిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం మరో ప్రత్యేక అప్‌డేట్‌ను విడుదల చేసింది. ట్రైలర్‌ను ఆధునిక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లిప్‌సింక్ సాంకేతికతతో మెరుగుపరచి మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ఇందులో నటీనటుల పెదాల కదలికలను డబ్బింగ్ సంభాషణలకు అనుగుణంగా సవరించడం ద్వారా సహజత్వాన్ని పెంచినట్లు వెల్లడించింది. సాధారణంగా ఇతర భాషల్లోకి డబ్ చేసిన చిత్రాల్లో మాటలు, పెదాల కదలికల మధ్య తేడా కనిపించడం సహజం. అయితే ఈ సాంకేతికతతో ఆ లోపాన్ని గణనీయంగా తగ్గించగలిగారని, ఏ భాషలో చూసినా నటీనటులు అదే భాష మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తోందని పలువురు ప్రేక్షకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏఐ ఆధారిత ఈ మార్పులకు సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభిస్తోంది. డైలాగులు మరింత సహజంగా వినిపిస్తున్నాయని, ట్రైలర్ నాణ్యత మరింత మెరుగైందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఇదే స్థాయి సాంకేతిక నాణ్యత చిత్రంలోనూ కనిపిస్తే ప్రేక్షకులకు విశేషమైన అనుభూతి కలుగుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణంలో, నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతోంది. అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. విడుదలకు ముందే విశేష ఆదరణ పొందుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.




## వారణాసి సెట్ నుంచి లీకులు.. రాజమౌళి బృందానికి మరో సవాల్



రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే షూటింగ్‌కు సంబంధించి వరుసగా దృశ్యాలు బయటకు వస్తుండటం చిత్రబృందానికి ఆందోళన కలిగిస్తోంది.తాజాగా చిత్రీకరణ జరుగుతున్న ప్రదేశం నుంచి యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వీటిలో మహేష్ బాబు పాల్గొన్న కీలక సన్నివేశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీడియోల నాణ్యత స్పష్టంగా లేకపోయినా, అధికారిక ప్రచారం ప్రారంభానికి ముందే దృశ్యాలు బయటకు రావడం నిర్మాతలకు ఇబ్బందిగా మారింది. సమాచారం అందుకున్న వెంటనే పలు వేదికల నుంచి వీడియోలను తొలగించే చర్యలు చేపట్టినా, అప్పటికే అవి అభిమానుల మధ్య విస్తృతంగా వ్యాపించాయి.ఈ చిత్రం కోసం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు అమలు చేస్తున్నట్లు తెలిసింది. షూటింగ్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు తప్పనిసరి. నటీనటులు, సాంకేతిక సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. మీడియా ప్రవేశానికీ పరిమితులు విధించడంతో పాటు, చిత్రబృందంలోని సభ్యులతో గోప్యత ఒప్పందాలపై సంతకాలు చేయిస్తున్నారు. అయినప్పటికీ తరచూ దృశ్యాలు బయటకు రావడం చిత్రబృందానికి తలనొప్పిగా మారింది. అత్యాధునిక ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో ప్రియాంక చోప్రా జోనాస్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2027 ఏప్రిల్ 7న సినిమాను విడుదల చేయాలని ఇప్పటికే ప్రకటించారు. కథ, పాత్రల రూపకల్పన, విజువల్ ఎఫెక్ట్స్ వంటి అంశాలను గోప్యంగా ఉంచాలని భావిస్తున్న చిత్రబృందానికి ఈ వరుస లీకులు కొత్త సవాల్‌గా మారాయి.

## రాయల్ లుక్‌లో రాశి సింగ్ సందడి

నీలిరంగు శాటిన్ దుస్తుల్లో రాశి సింగ్ చేసిన తాజా ఫోటోషూట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆకర్షణీయమైన పూల డిజైన్, స్టైలిష్ డ్రేపింగ్‌తో కూడిన ఈ వస్త్రధారణలో ఆమె ఎంతో ఆత్మవిశ్వాసంగా కెమెరాకు పోజులిచ్చింది. సహజంగా వదిలిన పొడవాటి జుట్టు, మృదువైన మేకప్, సొగసైన ఆభరణాలు ఆమె అందాన్ని మరింత మెరిపించాయి. గులాబీ రంగు నేపథ్యంపై ఆమె గ్లామరస్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో జన్మించిన రాశి సింగ్ సినీ రంగంలోకి రాకముందు ఎయిర్ హోస్టెస్‌గా పనిచేశారు. అనంతరం నటనపై ఆసక్తితో చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె 2021లో ఆది సాయికుమార్ హీరోగా తెరకెక్కిన తెలుగు రొమాంటిక్ చిత్రం 'శశి' ద్వారా కథానాయికగా పరిచయమయ్యారు. ఈ చిత్రంలో 'సునీ' పాత్రలో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు.ఆ తర్వాత 2023లో విడుదలైన 'ప్రేమ్ కుమార్' చిత్రంలో 'నేత్ర' పాత్రలో కనిపించిన రాశి, తన సహజ నటనతో మంచి గుర్తింపు సంపాదించారు. 2024లో వచ్చిన 'భూతద్దం భాస్కర్ నారాయణ'లో 'లక్ష్మి' పాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నారు. అదే ఏడాది విడుదలైన క్రైమ్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం'లో ఏసీపీ వైదేహిగా కనిపించి తన నటనలో మరో కోణాన్ని చూపించారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతున్న ఆమెకు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ లభిస్తోంది.ప్రస్తుతం రాశి సింగ్ పలు ఆసక్తికరమైన చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'బ్లైండ్ స్పాట్', 'పంచ్ మినార్', 'సంతాన ప్రాప్తిరస్తు' వంటి చిత్రాలతో పాటు 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు', 'గాసిప్' చిత్రాల్లోనూ నటిస్తున్నారు. సినిమాలతో పాటు 'పాపం పసివాడు', '3 రోజెస్ - సీజన్ 2' వంటి వెబ్ సిరీస్‌ల్లో కూడా నటించి డిజిటల్ వేదికలపై తన ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు.నటనతో పాటు వ్యాపార రంగంలోనూ రాశి సింగ్ తన ప్రతిభను చాటుతున్నారు. ఫుడ్, కేఫే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి విజయవంతమైన యువ పారిశ్రామికవేత్తగా కూడా గుర్తింపు పొందుతున్నారు. ఒకవైపు సినిమాలు, మరోవైపు వ్యాపార బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ కెరీర్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఆమె ఎంపిక చేసుకుంటున్న విభిన్న కథలు, పాత్రలు భవిష్యత్తులో తెలుగు చిత్రసీమలో మరింత బలమైన స్థానం సంపాదించేందుకు దోహదపడతాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## జి.డి. నాయుడు'గా మాధవన్.. మరో స్ఫూర్తిదాయక బయోపిక్‌కు సిద్ధం




వాస్తవ సంఘటనలు, గొప్ప వ్యక్తుల జీవితాలను వెండితెరపై ఆవిష్కరించడంలో నటుడు ఆర్. మాధవన్ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'తో ప్రశంసలు అందుకున్న ఆయన, ఇప్పుడు భారతీయ శాస్త్ర, పారిశ్రామిక రంగంలో విశిష్ట సేవలు అందించిన గోపాల స్వామి దొరైస్వామి నాయుడు జీవితకథ ఆధారంగా తెరకెక్కిన 'జి.డి. నాయుడు' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, భారతదేశ సాంకేతిక అభివృద్ధికి విశేష కృషి చేసిన జి.డి.నాయుడు జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరించనుంది. 'ఎడిసన్ ఆఫ్ ఇండియా', 'మిరాకిల్ మేన్', 'వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూర్'గా గుర్తింపు పొందిన ఆయన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఈ సినిమాలో చూపించనున్నారు.

ఈ చిత్రంలో సత్యరాజ్, జయరామ్, ప్రియమణి, దుషారా విజయన్, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటించారు. గోవింద్ వసంత స్వరపరిచిన నేపథ్య సంగీతం చిత్రానికి మరింత బలం చేకూర్చనుంది. జి.డి. నాయుడు పాత్ర కోసం మాధవన్ ప్రత్యేకంగా మేకోవర్ అవుతూ, విభిన్న దశల్లో కనిపించనున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమైంది. ఇప్పటికే విడుదలైన తెలుగు ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. కాలానుగుణ వాతావరణాన్ని ప్రతిబింబించే సెట్లు, నిర్మాణ విలువలు, మాధవన్ నటన సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. భారతీయ శాస్త్రవేత్త జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా ఆవిష్కరించే ఈ చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'జి.డి. నాయుడు' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న థియేటర్లలో విడుదల కానుంది. శాస్త్రవేత్త, ఆవిష్కర్తగా చిరస్థాయిగా నిలిచిన జి.డి. నాయుడు జీవితగాథను కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నంగా ఈ బయోపిక్ నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నాని కొత్త అవతార్‌కు ప్రశంసలు

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తొలి చిత్రం 'దసరా'తోనే తనదైన ముద్ర వేశారు. ఆ సినిమాతో నాని కెరీర్‌లో గుర్తుండిపోయే విజయాన్ని అందించిన ఆయన, ఇప్పుడు అదే కాంబినేషన్‌లో మరింత భారీ స్థాయిలో 'ది ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానులు, ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా విడుదలైన అధికారిక ట్రైలర్ ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో నాని గత చిత్రాలకు భిన్నంగా అత్యంత పవర్‌ఫుల్, తీవ్ర భావోద్వేగాలతో కూడిన పాత్రలో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ప్రెజెంటేషన్, నేపథ్య సంగీతం, సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ట్రైలర్‌లో వినిపించిన సంభాషణలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. శ్రీకాంత్ ఓదెల తన ప్రత్యేక మేకింగ్ శైలిని మరోసారి చూపించినట్లు ట్రైలర్ స్పష్టంగా తెలియజేస్తోంది. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్ పరంగా కూడా భారీ అనుభూతిని అందించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ట్రైలర్ విడుదలైన తర్వాత సామాజిక మాధ్యమాల్లో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో రూపొందుతున్న **'ది ప్యారడైజ్'** 2026 సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'దసరా' తర్వాత నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ మరోసారి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తుందనే ఆశాభావం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com